
నేటి దినపత్రిక
సూర్య
ఉత్తరాంధ్ర
www.suryaa.com
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం
బుధవారం
17-7-2024
పేజీలు 8


# విశాఖలో బాల గణపతి!

-అయోధ్య రామాలయం సెట్‌లో వినాయకుడి దర్శనం -నగరంలో మరో వినూత్న పందిరి రెడీ -రామాలయ రాళ్లతో ఆది దేవుడి ప్రతిమ -ఒకే చోట పెద్ద వినాయకుడు, చిన్న విఘ్నేశ్వరుడు



**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** విశాఖలో మరో వినూత్న వినాయకుడు కొలువుదీరనున్నాడు. వినాయక చవితి సంబరాల్లో భాగంగా 'యూత్ ఐకాన్' రాజు ఈ సారి మరో సెట్ నిర్మించనున్నారు. గతేడాది తెలుగు రాష్ట్రాల్లోనే గొప్పగా 'చాకొలెట్ వినాయకుడ్ని' రూపొందించి మన్ననలందుకున్న రాజు ఈ సారి ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో 'బాల గణపతి'ని దించనున్నాడు. అందుకోసం ఇప్పటి నుంచే రాజు ఏర్పాట్లు చేపడుతున్నాడు. ఇక్కడి విష్ణుకుమార్ రాజు గ్రౌండ్స్‌లో శ్రీఅయోధ్య రామమందిరం సెట్ పేరిట ఉత్సవాలు నిర్వహించనున్నాడు. అందుకోసం ఏకాదశి సందర్భంగా బుధవారం కర్ర పూజ కూడా చేయనున్నాడు. ఈ సెట్‌లో రెండు వినాయకుడి ప్రతిమలు ఉంటాయి. ఇందులో స్పెషల్ ఏంటంటే ఒకటి మట్టితో చేసే పెద్ద వినాయకుడు అయితే మిగతా 2లో

# విశాఖ నుంచి దూర ప్రాంతాలకు కొత్త బస్సులు

-సీఎం చంద్రబాబు పచ్చ జెండా -వైసీపీ ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేయని వైనం




**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** విశాఖలో కొత్త బస్సులు పరుగులు తీయనున్నాయి. ఈ మేరకు మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబు కొత్త బస్సుల కొనుగోలుకు పచ్చ జెండా ఊపారు. విశాఖ వాసులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త చెప్పారు. విశాఖ రీజియన్‌కు కొత్తగా సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సులు రానున్నాయి. ప్రయాణీకులకు మంచి సర్వీసులు అందించేందుకు ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ బస్సులను అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సర్వీసులుగా నడపనున్నారు. దీంతో విశాఖ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇక నుంచి కొత్త బస్సులలో ప్రయాణించవచ్చు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత ఆర్టీసీలో ప్రయాణీకులకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు పెంచి ఆదాయ మార్గాలను పెంచుకోవాలని చూస్తున్నారు. అందుకే కొత్త బస్సులను ప్రవేశపెట్టి ప్రైవేటు బస్సులకు ధీటుగా డిమాండ్ ఉన్న రూట్‌లలో బస్సులు నడపాలని చూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త బస్సులు ప్రవేశపెట్టాలని ప్రయత్నాలు చేసినా అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ ఏర్పడిన తర్వాత ఆర్టీసీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు కొత్త బస్సులు వస్తున్నాయి. ఇప్పటికే కొన్ని కొత్త బస్సులు రాగా మరికొన్ని బస్సులు త్వరలోనే మిగతా 2లో

# ప్రాణ నష్టం లేకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు

క్రైసిస్ మేనేజ్మెంట్ మీటింగ్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్




విశాఖపట్టణం, జూలై 16, మేజర్‌న్యూస్ : ప్రాణ నష్టం లేని విధంగా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అన్ని చోట్లా ఆటోమెటిక్ అలారం మెకానిజం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, కంపెనీల యాజమాన్యాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. రెండు కిలోమీటర్ల పరిధి వరకు ప్రమాద జోన్ గా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా పరిశ్రమల్లో పని చేసే సిబ్బందిని, చుట్టు పక్కల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని చెప్పారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో మంగళవారం ఉదయం వివిధ విభాగాల అధికారులతో జిల్లా క్రైసిస్ మేనేజ్మెంట్ గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అక్కడ పని చేసే సిబ్బందికి ప్రమాదాల నుంచి తప్పించుకోవటం ఎలా అనే అంశంపై శిక్షణ ఇప్పటించాలని చెప్పారు. ఆయా కంపెనీల్లో పని చేసే సిబ్బందికి, కార్మికులకు తప్పనిసరిగా భీమా పాలసీ చేయించాలని ఆదేశించారు. ఆరోగ్యకర వాతావరణంలో కార్మికులు పని చేసుకునేలా వసతులు కల్పించాలని, పర్యావరణ హిత విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కంపెనీ యాజమాన్యాలకు కలెక్టర్ సూచించారు. కార్మికులు, ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని చోట్లా ఎమెర్జెన్సీ మిగతా 2లో

# జిల్లా సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

-6కెవి ఆక్సీజన్ ట్యాంకు ఏర్పాటు -కొత్తగా రెండు మరుగుదొడ్ల సముదాయాలు -అందుబాటులోకి వచ్చిన ఎంఆర్ఐ స్కానింగ్ -ఎంపి నిధులతో ఘోషా ఆసుపత్రిలో లిఫ్ట్ -మహారాజా సర్వజన ఆసుపత్రిగా పేరు మార్పునకు ప్రతిపాదన -జిజిహెచ్ అభివృద్ధికమిటీ సమావేశాంలో నిర్ణయాలు



**విజయనగరం బ్యూరో, జులై 16, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఈ ఆసుపత్రి ద్వారా రోగులకు అందుతున్న సేవలను మరింత మెరుగు పర్చాలని, అదనపు సౌకర్యాలు కల్పించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిర్ణయించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిజిహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. జిల్లా సర్వజన ఆసుపత్రి, ఘోషా ఆసుపత్రుల్లోని సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను, విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు కమిటీ ముందు ఉంచారు. వీటిపై చర్చించి, ఆసుపత్రి అభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఇటీవల మరమ్మతుకు గురైన ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ సిద్దమై రోగులకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో కొత్తగా మరో బోరు వేయడానికి జిల్లా కలెక్టర్ నిధులను మంజూరు చేస్తూ, వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి కొత్తగా రెండు మరుగుదొడ్ల మిగతా 2లో

# రేపు హెల్మెట్ వాడకంపై వన్-కె వాక్



2లో

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

## గిరిప్రదక్షిణ ఏర్పాట్లను

# పరిశీలించిన జిల్లా కలెక్టర్

అప్పుఘర్ నుంచి తొలి పావంచా వరకు ట్రైల్ రన్

2లో



# జిల్లా ఎస్పీ మురళీకృష్ణకు ఘనంగా వీడ్కోలు



**అనకాపల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభను ఆర్మ్ రిజర్వు పోలీసులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అనంతపూర్ జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా విశాఖపట్నం, కైలాసగిరి ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానం నందు ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు సారథ్యంలో మిగతా 2లో

# పన్నుల్లేవు..పట్టించుకోరు!

-పంచాయతీల్లో పన్ను లేని నివాసాలెన్నో? -కొత్త పన్నులు వేయడంలోనూ, పాతవి వసూలు చేయడంలోనూ నిర్లక్ష్యం -పంచాయతీ అదాయాలకు భారీ గండి







**అనకాపల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** జిల్లాలోని లెక్కకు మించి పంచాయతీ కేంద్రాల్లోని నివాసాలకు పన్నులు వేయడంలో ఆయా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతేనా ఇప్పటికే ఉన్న పన్నులు వసూలు చేయడంలోనూ అదే నిర్లక్ష్యం ఫలితంగా పన్నులు పెండింగ్లో పడిపోతున్నాయి. ఇక పంచాయతీలకు ఆదాయం ఏ విధంగా సమకూరుతుంది అని పలువురు నాయకులు హేళన చేస్తున్నారు. ప్రధానంగా పంచాయతీ వ్యవస్థలో పన్నులు వసూలు చేసే భాధ్యత బిల్ కలెక్టర్లది అయినప్పటికీ కొత్త భవనాలకు పన్నులు రికార్డు చేయవలసింది మాత్రం కార్యదర్శిలే. గత ప్రభుత్వ హాయంలో గ్రామ స్వరాజ్యం పేరుతో పంచాయతీ వ్యవస్థను విభజించి పాలించడంలో భాగంగా సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేయడం కారణంగా పన్నులు విధించే తీరు గాడి తప్పినట్లు పలువురు టీడీపి నాయకులు మిగతా 2లో

# ఐసిడిఎస్ ప్రాజెక్టులో కోల్డ్ వార్




-పిఓ తీరుపై సూపర్వైజర్ల మండిపాటు -అంగన్వాడి కార్యకర్తలతోనే కార్యక్రమాలు

2లో




# ఐసిడిఎస్ ప్రాజెక్టులో కోల్డ్ వార్

**పార్వతీపురం రూరల్, జూలై 16, మేజర్‌న్యూస్:** స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ లో అధికారులకు, కిందిస్థాయి సిబ్బందికి మధ్య కోల్డ్ వార్ నడుస్తుంది. ప్రస్తుత సిడిపిఓ పీవో తీరును సూపర్వైజర్లతో పాటు కార్యాలయ సిబ్బంది వ్యతిరేకిస్తూన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా సిడిపిఓ ముందుగా వ్యవహరిస్తున్నారని సహా ఉద్యోగులు కొందరు బాహాటంగా ఆరోపిస్తున్నారు. దీంతో వివాదాలకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం కేంద్ర బిందువుగా మారిందనే చెప్పాలి. క్షేత్రస్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలను సమన్వయపరిస్తూ రికార్డుల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నారు. శాఖపరంగా ఇటువంటి ఆదేశాలు ఇవ్వాలన్న పిఓ సూచన మేరకు ఆయా సూపర్వైజర్లు కార్యకర్తలకు తెలియజేస్తారు. అంతేకాకుండా ప్రతి నెల స్టాక్ రిజిస్టర్ల వివరాలు ఆన్లైన్ చేయడం ,పిల్లల హాజరు, వంటివి సూపర్వైజర్లు మాసాంతపు తనిఖీల్లో చూసి తుది నివేదికను కార్యాలయానికి సమర్పిస్తారు. దీని ఆధారంగా ఆయా కేంద్రాలకు స్టాక్ ను విడుదల చేస్తుంటారు. ఈ విషయంలో సూపర్వైజర్లు ఎంతో అప్రమత్తంగా వ్యవహరించి విధులు నిర్వహించే ఉంటుంది. ఇటువంటి సమయంలో వారికి సీడీపీఓ సలహాలు సూచనలు ఇస్తుంటారు. ప్రస్తుత సిడిపిఓ మాత్రం నేను... సీతయ్యను...? అన్న విధంగా సూపర్వైజర్ లను పక్కన పెట్టేసి, కార్యకర్తలతో నేరుగా ఆయనే మాట్లాడి మొండిగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మాసాంతపు సమావేశాల్లో రికార్డులను ఆయనే పరిశీలించి స్టాక్ విడుదలకు ప్రతిపాదిస్తున్నారని, అలాగే కార్యాలయంలో ఏం జరుగుతున్నా తమ దృష్టికి లేకుండా అంగన్వాడీ కార్యకర్తలతో సిడిపిఓ మాట్లాడుకోవడం చేస్తున్నారని కొందరు సూపర్వైజర్లు అంటున్నారు. ప్రాజెక్టు పరిధిలో పార్వతీపురం మున్సిపాలిటీ తో పాటు మండలంలో అంగన్వాడి కేంద్రాలు వస్తాయి. మండల విషయానికి వస్తే ఇద్దరూ సూపర్వైజర్లతో పాటు మున్సిపాలిటీలో మరో ఇద్దరు ఉన్నారు. వీరందరితోపాటు సిడిపిఓ కార్యాలయం సిబ్బందితో కూడా మొండిగా వ్యవహరిస్తున్నారని పలువురు ఉంటున్నారు. ఏదేమ ట్కనా ఈ విషయంలో ఉన్నత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో స్థానిక ప్రాజెక్టు వివాదాలకు నిలియంగా మారే అవకాశం లేకపోలేదు.

# పన్నుల్లేవు..పట్టించుకోరు!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపిస్తున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం మారడంతో నైనా పంచాయతీలకు ఆదాయం పెంచే దిశగా కార్యదర్శిలు కృషి చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల భోగట్టా. అనకాపల్లి మండలంలోని తుమ్మపాల, కొత్తూరు మేజర్ పంచాయతీలు ఉండగా ఈ రెండు పంచాయతీల పరిధిలో వందల సంఖ్యలో పన్నులు లేని నివాసాలు దర్శనమిస్తున్నాయి. అంతేనా వీటికి సమీపంలోని మార్టూరు, బవులవాడ, సత్యనారాయణ పురం, పిసినికాడ, విలీన గ్రామాల శివారు పంచాయతీల్లో సైతం వందల సంఖ్యలో ఇళ్లకు పన్నులు వేయాల్సి ఉంది. అనకాపల్లి పట్టణానికి అతే చేరువలో ఉన్న కారణంగా ఆయా పంచాయతీల్లో ఇళ్లు, గ్రూప్ హౌస్, అపార్మెంట్లు వాటి నిర్మాణాలు ఇటీవల జోరుగా సాగుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న పంచాయతీల్లో గడచిన ఐదేళ్ల కాలంలో నిర్మించిన ఇళ్లకు పన్నులు వేయలేకపోవడం విశేషంగా ఉంది అని చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, పంచాయతీ అధికారులు దృష్టి సారించి పన్నులు లేని నివాసాలతో పాటు వాణిజ్య సముదాయాలకు పన్నులు విధించి పంచాయతీల ఆదాయ మార్గాలను పెంపొందించాలని ప్రజలు, కూటమి నాయకులు కోరుతున్నారు.

# జిల్లా సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సముదాయాలను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. సోలార్ పవర్ యూనిట్ సామర్థ్యాన్ని 150 నుంచి 300 కిలోవాట్లకు పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు, వార్డు సచివాలయాల నుంచి ఐదుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను డిప్యుటేషన్‌పై తక్షణమే పంపించాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో అదనంగా 6 కెవి ఆక్సిజన్ ట్యాంకును ఏర్పాటు చేసి, మొత్తం 257 పడకలకూ పైప్‌లైన్ వేయాలని నిర్ణయించారు. సుమారు 2.5లక్షల వ్యయంతో 20 స్ట్రెచర్‌లు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఘోషాసుపత్రిలో ఎంపి నిధులు రూ.31లక్షలతో కొత్తగా భారీ లిఫ్ట్‌ను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఇక్కడి రక్తనిల్వ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని, సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు. ఫార్మసీ విభాగంలో కొత్తగా ఫ్రిజ్, ఎసి సదుపాయం కల్పించడానికి నిర్ణయించారు. పే వార్డుల్లోని ఛార్జీలను పెంచాలని అధికారులు ప్రతిపాదించగా, ఎంఎల్‌ఏ అదితి కోరిక మేరకు ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. రెండు ఆసుపత్రుల్లో ద్విచక్ర వాహనాల పార్కింగ్, కేంటిన్, రిటైల్ మెడికల్ షాప్ నిర్వహణకు టెండర్లు పిలవాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన బలవర్ధక ఆహార పదార్థాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండు ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందినీ తమ అనుమతి లేకుండా బదిలీ చేయవద్దని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు రూ.80లక్షలతో సర్వజన ఆసుపత్రి మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిజిహెచ్‌ను మహారాజా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా పేరు మార్చేందుకు, ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ పివిజిరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సభ్యులు ప్రతిపాదించగా, ఈ ప్రతిపాదనలను ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించారు.

ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, ఘోషా ఆసుపత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయడానికి ఎంపి నిధులనుంచి రూ.31లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆసుపత్రి ప్రాంగణంలో పివిజి రాజు విగ్రహం ఏర్పాటుకు తన సొంత నిధులను వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. తమది ప్రజాప్రభుత్వమని, ప్రజల సంక్షేమమే తమకు ముఖ్యమని ఎంపి పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఎంపి కోరారు. సమావేశంలో డిఆర్ఓ ఎం.సుమబాల, జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీ శంకర్, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, కమిటీ సభ్యులు డాక్టర్ వివిఎస్ ప్రసాద్ తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

## రేపు హెల్మెట్ వాడకంపై వన్-కె వాక్

**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** ద్విచక్ర వాహనం నడిపే ప్రతి వాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలని అందుకు సంబంధించి అవగాహన కార్యక్రమం ఈనెల 18 న గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలపాటి గిరిధర్ , డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి , విశాఖపట్నం వారు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉన్నత న్యాయస్థానం యొక్క ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కార్యక్రమం లో భాగంగా విశాఖ జిల్లా మొత్తం ఎంఎల్ఎస్సీ అధికార పరిధిలో న్యాయవాదులు, పీఎల్‌వీలు, విద్యార్థులు ఆధ్వర్యంలో 18 వ తేదీన గురువారం ఉదయం గం.06.30 ని ల నుండి ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం నుండి పోలీస్ మెస్ వరకు ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధారణ పై 'వన్-క్ వాక్' ప్రజా ర్యాలీ జరుగునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, న్యాయవాదులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రాణ నష్టం లేకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు

(మొదటి పేజీ తరువాయి)

రెస్పాన్స్ టీంలను నిత్యం అందుబాటులో ఉంచాలని, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవరించాలో తగిన శిక్షణ అందించాలని సూచించారు. కార్మికులు, ప్రజల ప్రాణాల విషయంలో ఎవరూ ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించడానికి వీలు లేదని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ క్రమంలో ఆయా కంపెనీలు చేపడుతున్న భద్రతా ప్రమాణాల గురించి ఒక్కొక్కరు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఫ్యాక్టరీల చీఫ్ ఇన్స్పెక్టర్ సురేశ్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం గణపతి, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ మురళీకృష్ణకు ఘనంగా వీడ్కోలు



(మొదటి పేజీ తరువాయి)

ఆర్మ్ రిజర్వ్ సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షించడంలో, నాటు సారా, గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో ఎన్ఫోర్స్మెంట్ అమలు చేయడంలో, భద్రత, బందోబస్తు, ఎన్నికల విధులలో ఆర్మ్ రిజర్వ్ సిబ్బంది జిల్లా పోలీస్ శాఖకు వెన్నెముకగా నిలిచిందని అభినందించి, తాను విజయవంతంగా విధులు నిర్వహించేందుకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ యస్. అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, మన్మథ రావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గిరిప్రదక్షిణ ఏర్పాట్లను
## పరిశీలించిన జిల్లా కలెక్టర్

**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** ఈ నెల 20, 21వ తేదీలలో జరిగే సింహాచలం లక్ష్మీ నరసింహస్వామి గిరిప్రదక్షిణ మహోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. పోలీస్ కమిషనర్ ఎస్. బాగ్చి, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, ఆలయ ఈవో శ్రీనివాసమూర్తి, ఇతర అధికారులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ ట్రైల్ రన్ నిర్వహించారు. అప్పుఘర్ వద్ద లుంబినీ పార్కు సమీపంలోని స్నాన ఘట్టాన్ని పరిశీలించి అక్కడ తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక వైపు భక్తులు వచ్చేందుకు మరొక వైపు బయటకు వెళ్లేందుకు అనువుగా ప్రత్యేక బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. బట్టలు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని చెప్పారు. లుంబినీ పార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ప్రత్యేక వాహన శ్రేణి ద్వారా ఎంవిపి, వెంకోజిపాలెం, కైలాసపురం, మాధవధార, మురళీ నగర్, ఎన్.ఎస్.టి.ఎల్, గోపాలపట్నం, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం, శ్రీనివాస్ నగర్, గోశాల మీదుగా సింహాచలం చేరుకున్నారు. అనంతరం అక్కడ జరిగిన సమీక్షా సమావేశంలో భాగస్వామ్యమయ్యారు. కార్యక్రమంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫక్కీరప్ప, ఇతర పోలీసు అధికారులు, జీవీఎంసీ, దేవాదాయ శాఖ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విశాఖ నుంచి దూర ప్రాంతాలకు కొత్త బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

విశాఖకు రానున్నాయి. అధికారం చేపట్టిన ఎన్డీయే ప్రభుత్వం పాలనను పరుగులు పెట్టిస్తోంది. వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని ఏపీ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింపచేయాలంటే అధికారులు, ఉద్యోగులు కష్టపడి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## విశాఖలో బాల గణపతి!

(మొదటి పేజీ తరువాయి)

మరొకటి బాల గణపతి బొమ్మ. అయోధ్యలోని రామ మందిరాన్ని నిర్మించిన రాళ్ల వ్యర్థాలతో ఇప్పటికే రాజు బాల గణపతి బొమ్మను చేయించాడు.

**విరాళంగా స్వామి బొమ్మ**

21రోజుల పూజల అనంతరం బాల గణపతి బొమ్మను ఏద్కైనా ఊరికి విరాళంగా ఇచ్చేస్తామని రాజు ప్రకటించాడు. ఇంకో విశేషం ఏంటంటే అయోధ్య రామ మందిరం సెట్ ప్రవేశ ద్వారంలో రాముడి చరిత్రను తెలియజేసేలా పెయింటింగ్స్ కూడా కొలువుదీరనున్నాయి. 100అడుగుల వెడల్పు, 60అడుగుల ఎత్తులో ఈ అయోధ్య సెట్ రూపొందించనున్నారు. ఇప్పటికే రెండెకరాల స్థలాన్ని చదును చేయించాడు. అయోధ్య సెట్‌తో పూజల కోసం ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకుంటున్నట్టు రాజు స్పష్టం చేశాడు.

## ఏయూ లైబ్రరీ వద్ద విద్యార్థుల ఆందోళన



**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** ప్రతిష్టాత్మక ఆంధ్రా యూనివర్శిటీకి తక్షణమే వీసీని నియమించాలని, ఏయూ లైబ్రరీలో మరిన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు మంగళవారం ఏయూ లైబ్రరీ మెయిన్ గేట్ వద్ద ఆందోళనకు దిగారు. సెలవు దినాల్లోనూ ఇక్కడ శిలాఫలాకాన్ని ఏర్పాటు చేయడం, అందులోనూ తప్పులు తడకులుగా ఉండడంపైనా నినదించారు. అధిక సంఖ్యలో పీహెచ్‌డీల్లో డబుల్ ఎంట్రీలుండడంపై ఆగ్రహం వ్యక్తం ఏశారు. అనేక అక్రమాలకు పాల్పడిన మాజీ వీసీ, రిజిస్ట్రార్‌లపై న్యాయ విచారణ జరిపించాలంటూ ఏయు విద్యార్థులు, పరిశోధకులు కొద్దిసేపు డిమాండ్ చేశారు.

## విశాఖలో 'డైనమిక్ వెహికల్ చెకింగ్'
### వాహనదారులకు గులాబీలతో అభినందన



**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ ఆదేశాల మేరకు సిరిపురం, మసీదు జంక్షన్ తదితర ప్రాంతాల్లో త్రీటౌన్ ట్రాఫిక్ పోలీసులు 'డైనమిక్ వెహికల్ చెకింగ్' చేపట్టారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలంటూ మైక్ ద్వారా ప్రచారం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి చలానాలు విధించారు. ట్రాఫిక్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనల్ని నగర ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు, బాషా, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ట్రాఫిక్ నియమాలు పాటించిన వారికి మాత్రం గులాబీతో అభినందించారు.

### లక్ష సీడ్ బాల్స్ తయారీ లక్ష్యంగా
## పిల్లలకు 'ఏవోఎల్' శిక్షణ!




**శ్రీకాకుళం, జూలై 16, మేజర్‌న్యూస్:** పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యతపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీడ్ బాల్స్ తయారీపై అవగాహనా కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు జిల్లా ఏవోఎల్ ప్రతినిధి డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని విశాఖ స్కూల్ ప్రారంభించిన ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాల్ని ఈ నెలాఖరులోగా 20పాఠశాలల్లో నిర్వహిస్తామని శ్రీ శ్రీ ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్ల పూడి రవి వివరించారు. సీడ్ బాల్స్‌ను ఎలా తయారు చేయాలి, వాటిని ఏ విధంగా ఉపయోగించాలనే అంశాలపై శిక్షణ అందజేశారు. 200మంది విద్యార్థులు పాల్గొని, సుమారు 800విత్తన బంతులు తయారు చేశారు. పండిట్ రవిశంకర్ గురూజీ ఆదేశాల మేరకు గత జూన్ 5నుంచి ఆగస్టు 19వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌తో పాటు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల అధినేత డాక్టర్ తమ్మినేని మధుసూదనరావు, హెచ్ఎం రామారావు మాట్లాడుతూ మారుతున్న వాతావరణ మార్పులకు మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ డీడీసీ సభ్యులు బెవర వెంకట రవిశంకర్, టీచర్లు వారణాసి సందీప్, దేసూళ సురేంద్ర, వలంటీర్ పి.శ్రీనివాస్, సీటీసీ మెంబర్ అన్నాపూర్ణ, అను తదితరులు పాల్గొన్నారు.

# ఎర్ర మట్టి దిబ్బల్ని నాశనం చేయొద్దు

### -అది గుర్తింపబడిన జాతీయ సంపద -ట్విట్టర్ లో అధికారుల్ని హెచ్చరించిన ప్రముఖ పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ -ఏపీ మంత్రి దుర్గేష్ కు లేఖ రాసిన మాజీ ఐఏఎస్ ఈఏఎస్ శర్మ -కేబినెట్ లో కూడా చర్చించాలని విజ్ఞప్తి




**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** విశాఖలోని ఎర్రమట్టి దిబ్బల్ని నాశనం చేయొద్దని, అవి గుర్తింపబడిన జాతీయ సంపద అని ప్రముఖ పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ ట్విట్టర్ వేదికగా అధికారుల్ని హెచ్చరించారు. 'ఉమ్మడి విశాఖ జిల్లా భీమిలిలో ఉన్న ఎర్రమట్టి దిబ్బల ప్రాంతం ఒక పర్యాటక ప్రాంతం మాత్రమే కాదని, దేశంలో ఉన్న 29 జాతీయ భౌగోళిక వారసత్వ సంపదల్లో ముఖ్య భాగం అని ఆయన గుర్తు చేశారు. ఇలాంటివి దేశంలో రెండు మాత్రమే ఉన్నాయని, ఒకటి భీమిలిలోనిది కాగా రెండోది తమిళనాడులోని పేరి వద్ద ఉ0దన్నారు. అటువంటి ప్రపంచ భౌగోళిక వారసత్వ సంపదపై ఇక్కడ దాడి జరుగుతోందని తనకు సమాచారం ఉందన్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని, ఇప్పటికే ఏపీ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి కూడా తీసుకువెళ్ళామన్నారు. అదే సమయంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ కూడా ఎర్ర మట్టి దిబ్బల విషయమై ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు కూడా ఈ-మెయిల్ ద్వారా ఎర్ర మట్టి దిబ్బల సంరక్షణపై సవివరంగా లేఖ రాశారని బొలిశెట్టి గుర్తు చేశారు. ఏపీలో వందలాది చారిత్రాత్మిక, పురావస్తు కేంద్రాలున్నాయని, కొన్నేళ్లుగా నగరాల విస్తరణ కారణంగా, భూముల ధరలు అధికంగా పెరగడం వల్ల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కళ్ళు వాటిపై పడ్డాయని ఆరోపించారు. అటువంటి ప్రముఖ స్థలాల్ని పరిరక్షించే బాధ్యత, రాజ్యాంగంలోని ఆర్టికల్ -49 క్రింద, పురావస్తు సైట్ల పరిరక్షణ చట్టాల క్రింద, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు.

**గత ప్రభుత్వం దారుణం**

గత ప్రభుత్వం కాపులుప్పాడలో పాత సర్వే నంబర్-314లో చట్టం కింద, 3వేల ఎకరాల నోటిఫై అయిన, క్రీస్తు పూర్వం 3వ శతాబ్దం నాటి, అతి ప్రాచీనమైన బౌద్ధ సైట్ విస్తీర్ణాన్ని 120ఎకరాలకు కుదించి, నోటిఫికేషన్ విడుదల చేసిన విషయాన్ని మీ దృష్టికి తీసుకు వస్తున్నానని ప్రస్తుత ప్రభుత్వానికి బొలిశెట్టి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో విశాఖ పౌరులు ఏపీ హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. 1978లో అప్పటి విద్యా మంత్రిత్వ శాఖ దూర దృష్టితో, తొట్లకొండ చుట్టుపక్కల 3వేల ఎకరాలకు పైగా, జీవో 627ద్వారా రక్షిత ప్రాంతంగా నోటిఫై చేయగా, 2021లో ప్రభుత్వం ఆ సైట్ ను 120ఎకరాలకు కుదించేలా జీవో నోటిఫై చేయడం విశాఖ ప్రజలకు ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ఇలాంటి అమూల్యమైన చారిత్రాత్మిక ప్రదేశాల్ని పరిరక్షించే బదులు, రాష్ట్ర ప్రభుత్వం, సైట్ విస్తీర్ణాన్ని కుదించే దిశగా కోర్టు ముందు వాదించడం కూడా ఇక్కడి వారికి బాధించిందన్నారు. కోర్టు కూడా కేంద్ర పురావస్తు పరిరక్షణ వ్యవస్థ (ఏఎస్ఐ)ను తొట్లకొండ సైట్ ను సర్వే చేయించి నివేదించాలని ఆదేశించింది. అయితే ఏపీ అధికారులు ఆ బృందానికి పూర్తి వివరాలు వెల్లడించకుండా, వారిని మభ్యపెట్టారనే అనుమానాయున్నాయి. అలాంటి ప్రదేశాల్ని పరిరక్షించే దిశగా, ఏపీ రాష్ట్రంతో పోలిస్తే, తెలంగాణ, హరియాణా, బిహార్ వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయన్న విషయాన్ని గుర్తించాలని బొలిశెట్టి గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం, కొన్ని సైట్లకు యునెస్కో గుర్తింపు కూడా తేగలిగింది. విశాఖలో ఉన్న తొట్లకొండ-బావికొండ-పావురాల కొండ తీర ప్రాంతం, ఇక్కడున్న ఇతర బౌద్ధిక ప్రదేశాలు, రాష్ట్రంలో తీర ప్రాంతంలో, అమరావతి వరకు ఉన్న బౌద్ధ వారసత్వ ప్రదేశాలకు ప్రపంచ స్థాయిలో, ఎప్పుడో గుర్తింపు రావాల్సి ఉందని, కానీ ప్రభుత్వ ఉదాసీనత వల్ల అటువంటి గుర్తింపు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**హర్యానాలో చూడండి**

హర్యానాలో ఉన్న అగ్రోహ పురాతన ప్రదేశంలో భూమి కింద ఉండిపోయిన చారిత్రాత్మక కట్టడాలు, రాడార్ సాంకేతికతతో పరిశోధన కోసం, ఆ రాష్ట్ర ప్రభుత్వం, ఎఎస్ఐతో ఒప్పందం చేసుకుందని బొలిశెట్టి తెలిపారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో చూడొచ్చన్నారు.

అలాగే బిహార్ ప్రభుత్వం కార్డిఫ్ యూనివర్సిటీ సాంకేతిక సహాయంతో శాటిలైట్ టెక్నిక్ ద్వారా, బోధ్ గయాలో భూమి కింద కప్పబడి ఉన్న కట్టడాలపై పరిశోధన చేసి, ఎన్నో కొత్త కట్టడాల్ని ప్రజల దృష్టికి తీసుకురాగలిగారని బొలిశెట్టి తెలిపారు. ముందున్న ప్రభుత్వాలు తొట్లకొండ విషయంలో బాధ్యతగా వ్యవహరించలేదని అభిప్రాయపడ్డారు. రెండు దశాబ్దాలకు ముందు, లార్స్ ఫోజిలిన్ అనే విదేశీ పరిశోధకుడు, తొట్లకొండ చుట్టుపక్కల, అప్పటి పురావస్తు శాఖ నిపుణుల పర్యవేక్షణలో, క్షుణ్ణంగా పరిశీలిం చి, 134 కొత్త పురావస్తు సైట్లు, 328 కొత్త బౌద్ధిక అవశేషాల్ని రిపోర్ట్ చేశారన్నారు. ఆయన పరిశోధనను థీసిస్, పుస్తక రూపంలో ప్రచురించబడిందని, గత ప్రభుత్వాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఒత్తిళ్లకు లొంగి, ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడమే కాకుండా, అందుకు వ్యతిరేకంగా కోర్టు ముందు వాదించడం కూడా వివాదాస్పదమైందన్నారు. ఇకనైనా ఈ ప్రభుత్వం తక్షణమే ఏపీలో విస్తృతం గా ఉన్న బౌద్ధ ప్రదేశాల్ని పరిరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాం డ్ చేశారు.

అలా అయితే ఈ ప్రాంతం బుద్దిస్ట్ కారిడార్ కింద ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించగలదన్నారు. నేషనల్ హెరిటేజ్ కన్జర్వేషన్ పాలసీ నిబంధనల్ని పాటిస్తూ, అటువంటి ప్రపంచ స్థాయి గుర్తింపు తేగలిగితే, ఆ కారిడార్ ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకుల్ని ఆకర్షిస్తుందన్నారు. హరియాణా, బిహార్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధంగా ఈ ప్రభుత్వం, తొట్లకొండ చుట్టుపక్కలున్న 3వేల ఎకరాల సైట్ ను శాటిలైట్ ఇమేజినరీ, జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్, రాడార్ టెక్నాలజీ ఉపయోగించి పరిశోధన చేయించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక, మంత్రిత్వ శాఖకు రాసిన లేఖల్ని కూడా జత పర్చినట్టు బొలిశెట్టి స్పష్టం చేశారు. ముఖ్యంగా శాటిలైట్ ఇమేజిన్ కోసం బెంగళూరులో ఉన్న నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ డ్ స్టడీస్ (ఎన్ఐఏ ఎస్) సాంకేతిక సహాయంతో, మీ ప్రభుత్వం తొట్లకొండ సైట్ ను (3వేల ఎకరాల విస్తీర్ణం) పరిశోధించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో అదే సంస్థ నలందా బౌద్ధిక సైట్‌ను కూడా పరిశోధన చేసి, అవశేషాల్ని ప్రజల ముందు పెట్టడం జరిగింద న్నారు. మీ ప్రభుత్వం ఆధ్వర్యంలో, తొట్లకొండ కుదింపు రద్ద యి, రాష్ట్రంలో శాలిహుండం నుంచి అమరావతి వరకు ఉన్న బౌద్ధిక సైట్లకు పూర్తి రక్షణ కలిగి, ప్రపంచ స్థాయిలో అటువంటి ఏకైక బుద్దిస్ట్ కారిడార్ కి గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నానన్నారు. కేబినెట్ సమావేశంలో కూడా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పర్యాటక శాఖ మంత్రులు విషయమై స్పందిస్తారని బొలిశెట్టి కోరుకున్నారు.

# పరమాత్మ ఎరుకతో జీవన ముక్తి పొందాలి

### వాసవి కల్యాణ మండపంలో 'మహిళా సంత్ సమాగం'

**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** ఆధ్యాత్మిక ప్రబోధకరాలు, ఏపీ%-%తెలంగాణా జోనల్ ఇన్‌చార్జి, హైదరాబాద్ నుంచి విచ్చేసిన మోహినీ అహుజా .జి. నగరంలో 'మహిళా సంత్ సమాగం' పేరిట ఓ కార్యక్రమం జరిపించారు. వన్‌టౌన్ సోల్జర్ పేటలోని వాసవీ కల్యాణ మండపంలో జరిపిన ఈ కార్యక్రమానికి ఉభయ గోదావరితో పాటు ఉత్తరాంధ్రకు చెందిన సుమారు 500మంది మహిళలు, నిరంకార మిషన్ భక్తుల రాకతో ఆ ప్రాంతమంతా మర్మోగిపోయింది. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉపన్యాసాలిచ్చారు. సద్గురు మాతా సుదీక్షా జి మహరాజ్ సత్య సందేశాన్ని అందరికీ వినిపించారు. ప్రతి ఒక్కరు సత్సంగత్యమునకు వచ్చి తద్వారా బ్రహ్మ జ్ఞానుల్కైన మహా పురుషుల సందేశములను విని వివేకమును పొంది, నేనెవరిని, ఎక్కడ నుంచి వచ్చాను, ఎక్కడికి వెళ్లగలమనే సత్యాన్ని గ్రహించి సద్గురువు ద్వారా బ్రహ్మజ్ఞానం పొంది, పరమాత్మతో అనుసంధానమైన నామస్మరణ ద్వారా నిరంకారునితో యోగమై పరమాత్మ ఎరుకతో జీవించి జీవన ముక్తి పొందాలని తెలిపారు. ఈ సమాగానికి విశాఖ శాఖ సంయోజకులు ప్రేమ్ రాంచంద్ మీరుపురి, సహ సంయోజకులు, జ్ఞాన ప్రచారకులు పీవీ రావు, జ్ఞాన ప్రజారకులు పీఎస్ఎన్ రాజు, క్షేత్రీయ సంచాలకులు రవి, సంచాలకులు రాజ్ వీర్ సింగ్ తదితరులు హాజరయ్యారు.





## రవీంద్ర భారతి పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుకలు



శ్రీకాకుళం, జూలై 16, మేజర్‌న్యూస్: స్థానిక చిన్నమండలవీధిలో గల రవీంద్రభారతి పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుకలు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోరాచంద్ పల్క ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత హానరరీ ఆర్మీ కాప్టెన్ గుండ.గంగులు విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించి మాట్లాడుతూ నాయకత్వ ప్రాముఖ్యతను, నాయకత్వ లక్షణాలను, వాటి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ యం.యెస్.మణి విద్యార్థి నాయకులకు చిత్తశుద్ధి,అంకితభావం, శ్రేష్ఠత, నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలని తెలియజేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నార్త్‌ఆంధ్ర జోనల్ ఇంఛార్జ్ యెన్. వెంకటేష్ కార్యక్రమములో పాల్గొని నూతనంగా నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు ప్రతిభావంతమైన నిర్ణయాలతో తోటి విద్యార్థులలో క్రమశిక్షణను, నైతిక విలువలను, బాధ్యతను పెంపొందింపజేయాలని అన్నారు. కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ గోరాచంద్ పల్కా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

### నేచర్ సేవ్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో



నరసన్నపేట, జూలై 16, మేజర్‌న్యూస్: స్వచ్ఛంద సేవా సంస్థ నేచర్ సేవ్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో పోలాకి మండలం రేవు అంపలాం, రాజారాంపురం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు ఇతర సామాగ్రిని పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థులు చక్కగా చదువుపై అవగాహన పెంచుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించిన నేచర్ సేవ్ సొసైటీ సభ్యులు లుకలాపు రంజిత్ కుమార్, తంగి కృష్ణ , కోరుకొండ శాంతారావు, గ్రామస్తులు దవులపిల్లి రామారావు, పోలి, వరప్రసాదరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నిర్మూలన పై సమీక్ష సమావేశం



బొబ్బిలి, జూలై 16, మేజర్‌న్యూస్: మండలంలో కుష్టు వ్యాధి నిర్మూలన పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ పి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బొబ్బిలి మండలంలో పిరిడి గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు వైద్యులు సమక్షంలో లికుష్టు వ్యాధి నిర్మూలనలి పై జూలై 18 నుంచి ఆగస్టు రెండు వరకు అన్ని గ్రామాలలో సర్వే చేయ నిమిత్తం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఓ శ్రీ ఆదిభట్ల చైనులు, ఈఓపిఆర్డీ అల్లు భాస్కరరావు, వైద్యులు వి ఎస్ కె రఘు వంశీ, ఎంపిహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామిగా జగన్నాథుడు



నరసన్నపేట, జూలై 16, మేజర్‌న్యూస్: నరసన్నపేట శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం లో జగన్నాథ ఉత్సవాలలో భాగంగా వేంకటేశ్వర స్వామి గా జగన్నాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. జగన్నాథ స్వామి కి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి సాయి కృష్ణమాచార్యులు. బుధవారం శయన ఏకాదశి సందర్భంగా జగన్నాథ స్వామి కి ఉదయం 10గంటలకు తులసి దళార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ప్రధాన అర్చకులు విజ్ఞప్తి చేశారు.

## "మిషన్ శక్తి " 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం

### ఐసిడిఎస్ లబ్ధిదారులకు స్త్రీ చట్టాలపై అవగాహన



శ్రీకాకుళం, జూలై 16, మేజర్‌న్యూస్: శ్రీకాకుళం పట్టణంలోని 29 వ వార్డు, దమ్మలవీధి, రెల్లివీధి, అంగన్వాడి కేంద్రం లో మిషన్ శక్తి కార్యక్రమం లో భాగంగా ఆ అంగన్వాడి కేంద్రం పరిధిలో ఉన్న ఐసిడీఎస్ లబ్దిదారులు అందరికీ 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూనపాలెం సెక్టర్ సూపర్ వైజర్ బి . యోగేశ్వరమ్మ బాల్యవివాహాలు చట్టరీత్య నేరమని బాల్యవివాహాలు చేయించేవారు, శిక్షర్హులు అన్నారు. ప్రతి తల్లి బిడ్డలుకు ఆధార్ కార్డు తప్పనిసరి, ఆధార్ నెంబర్ తో అంగన్వాడీ టీచర్స్ ద్వారా ఆన్లైన్ చేయించుకోవాలని, తల్లి బిడ్డల పేరు మీద జాయింట్ బ్యాంక్ అకౌంట్ ను ఓపెన్ చేసి ప్రభుత్వం అందించే లబ్దిని పొందేందుకు ఎటువంటి ఆటంకం లేకుండా అవకాశం కలుగుతుందని ప్రతి లబ్ధిదారులు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూపర్వైజర్ విజ్ఞప్తి చేశారు. గృహహింస, వరకట్న వేధింపులు , స్త్రీలను అక్రమ రవాణా వంటి సంఘ విద్రోహక కార్యక్రమాలు మీ పరిధిలో ఉంటే ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ కి తెలియపరచవచ్చునని తెలియజేశారు. అలాగే లబ్ధిదారుల గృహ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎల్ . జ్యోతి, కె . పార్వతి, ఆయాలు పి . శారద, ఎం . శశి కళ పాల్గొన్నారు.

## వాహనాల రోడ్లపై రాంగ్ పార్కింగ్ చేయరాదులి



శ్రీకాకుళం, జూలై 16, మేజర్‌న్యూస్: పట్టణంలో వాహనాల రద్దీ రోజురోజుకి విపరీతంగా పెరిగిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలక్కుండా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అలా పాటించిన యెడల చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్ నుండి కాలేజీ రోడ్డులో వ్యాపారాలు ఎక్కువగా జరగడం జన సంచారం ఎక్కువగా కలగడం ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని అందువల్ల ఫుట్ పాత్ వ్యాపారం చేసిన వాళ్ళు ఫుట్ పాత్ పైనే ఉండాలని, అలాకాని ఎడల చర్యలు తప్పవని అన్నారు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందని వాహనదారులు, ఫుట్ పాత్ వ్యాపారస్తులు గమనించాలని, నిబంధనలకు అతిక్రమిస్తే వాహనాల్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

# జిల్లా జర్నలిస్టుల మహా సభకు సన్నాహాలు

### హాజరవుతున్న జాతీయ, రాష్ట్ర నాయకత్వం



నరసన్నపేట, జూలై 16, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా శాఖ 31వ మహా సభ నిర్వహణకు మీడియా సంస్థ కార్యాలయంలో ఆహ్వాన కమిటీసమావేశ మయింది. ఈ సందర్భంగా ఐజేయూ జాతీయ కార్య వర్గసభ్యులు నల్లి ధర్మారావు, కమిటి సభ్యులకు దిశా దశ నిర్దేశించేశారు. 67 సంవత్సరాల చరిత్రగల యూనియన్, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం రాజీలేని పోరాటాలు చేస్తోందని, ఆ పోరాటాల వల్ల,సాధించిన ఫలితాలను వివరిచారు. ప్రస్తుతం మండల స్థాయిజర్నలిస్టు వరకూ అందుకుంటున్న పథకాలను ఒక్క ఏపీయూడబ్ల్యూజేపోరాట ఫలితాలేనని గుర్తుచేశారు. గడిచిన రెండు దశాబ్దాల్లోటిడిపి, వైసిపి కొత్తగా ఏ ఒక్క ప్రభుత్వం కొత్తగా ఏ ఒక్కపథకం మంజూరు చేయలేదని విమర్శించారు. ఇళ్లస్థలాలు,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒక్కలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ వంటిసదుపాయాలకు ప్రత్యేకంగా జీవోలు విడుదల చేయాలని ప్రతి ఏటడిమాండ్ చేస్తున్నా, గత ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కొత్తనిబంధనలు పెట్టి, అక్రిడేషన్ సదుపాయాన్ని వైసిపి కుదించి ఎంతోమంది జర్నలిస్టులకు అన్యాయం చేసిందన్నారు. ఇళ్లస్థలాల కేటాయింపు, ఇళ్ల నిర్మాణాలకు రెండు ప్రభుత్వాలు మాట ఇచ్చి తప్పిందన్నారు. చిన్న పత్రికలకు ప్రోత్సాహం ఇవ్వకుండా, జీఎస్టీ విధించడం అన్యాయమన్నారు.చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు.గత ప్రభుత్వాలు జరిగిన అన్యాయాన్ని జిల్లాల మహా సభలలో రాష్ట్ర నాయకత్వం ఒత్తిడి చేయాలని నిర్ణయించినట్టు ధర్మారావు చెప్పారు. ఉద్యమ చరిత్ర గల పలాస-కాశబుగ్గలో జరుగుతున్న 31 వ మహాసభ కొత్త ఉత్తేజాన్నిఅందిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా ఆహ్వానించామన్నారు. జాతీయ రాష్ట్ర నాయకులు వస్తున్నారని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్. ఈశ్వరరావు, గరిమెళ్ళ ప్రెస్క్లబ్ కార్యదర్శి ఎస్. నవచైతన్య, యూనియన్ జిల్లా కార్యదర్శి, మహారాణ , ఆహ్వానసంఘ కన్వీనర్ సి.హెచ్. జగదీష్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ నేతాజీ, జయంత్ కుమార్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కింజరాపు కృష్ణ ఆహ్వాన కమిటీ సభ్యులు కొంచాడ రవి, గుండా సుభాష్ చంద్రబోస్, శివజ్యోతి సంతోష్ ,పల్లి కృష్ణ కిషోర్ తదితరులు హాజరయ్యారు.

# ప్రతి పిల్లవానిపైన పర్యవేక్షణ ఉండాలి

### -డ్రాపౌట్ల తోనే అనర్థాలు

### -రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పా రావు

విజయనగరం బ్యూరో, జూలై 16, మేజర్‌న్యూస్: :పిల్లల ప్రవర్తన పై తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పా రావు తెలిపారు. సోషల్ మీడియా ప్రభావం వలన ప్రస్తుతం తల్లిదండ్రులతో పిల్లలకు దూరం పెరిగిపోతుందని, పిల్లలు ఏం చేస్తున్నారో కనిపెట్టలేక పోతున్నారని పెర్కొన్నారు. బాలల పట్ల మాదక ద్రవ్యాలు, మత్తు పదార్ధాల నిరోధం పై జాయింట్ ఏక్షన్ ప్లాన్ అమలు పై జిల్లా అధికారులతో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మత్తు పదార్ధాల నిరోధానికి శాఖల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసి అమలు చేయాలని, జిల్లా అధికారులు తమ సలహాలు, సూచనలను అందజేస్తే ప్రభుత్వానికి సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు. 3 నెలల తర్వాత వాటి ఫలితాలను మరోసారి చర్చించుకొని అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం తో చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పంచాయతి స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఈ విషయం పై చర్చ జరగాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. గ్రామీణ స్థాయి లో డి.ఆర్.డి ఎ, మెప్మా ఆధ్వర్యం లో జరుగుతున్న డ్వాక్రా సమావేశాలలో మత్తు పదార్ధాల వలన కలిగే అనర్ధాల పై ఎజెండా గా చేర్చి చర్చ జరగాలన్నారు. హోర్డింగ్ ల ద్వారా విస్తృత ప్రచారం జరగాలని, మున్సిపల్, పంచాయతి, విద్యా శాఖలు కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గోండు సీతారాం మాట్లాడుతూ ప్రధానంగా పాఠశాలల్లో డ్రాప్ అవుట్ల వల్లనే అనేక అనర్ధాలు జరుగుతున్నాయని చదువు మానేసి స్వేచ్ఛగా తిరుగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని



విద్యా శాఖాధికారి డ్రాప్ అవుట్లను తగ్గించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, బడికి రాని పిల్లల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థుల పై కన్నేసి ఉంచాలని, మద్యం, గంజాయి వంటి పదార్ధాలను విక్రయించకుండా చుట్టూ ప్రక్కల గట్టి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా అర్బన్ లో గంజాయి, మత్తు పదార్ధాల విక్రయాలు బెగ్గింగ్ ముసుగులో జరుగుతున్నాయని, వీరి పట్ల అప్రమతంగా ఉండాలని సూచించారు. పోలీస్, మున్సిపల్ కమిషనర్లు దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమావేశం లో ఇంచార్జ్ డి.ఆర్.ఓ సుమబాల, బాల సంక్షేమ కమిటి ఛైర్పర్సన్ హిమబిందు, ఐ.సి.డి.ఎస్ పి.డి శాంతకుమారి, డి.ఆర్.డి.ఎ , మెప్మా పి.డి లు కళ్యాణ చక్రవర్తి, సుధాకర రావు, డి.ఎం.హెచ్ ఓ డా.భాస్కర రావు, డి.ఈ.ఓ ప్రేమ కుమార్, పంచాయతి అధికారి శ్రీధర్ రాజ, డిస్ట్రిక్ట్ బి సి వెల్ఫేర్ అధికారి సందీప్, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ అధికారి శరత్ కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళలు వ్యాపారదిగ్గజాలు మారాలి

### జిల్లా కలెక్టర్



పార్వతీపురం, జూలై 16, మేజర్‌న్యూస్: :స్వయం సహాయక సంఘాల్లో గల మహిళలు వ్యాపార దిగ్గజాలు కావాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా మహిళా సమాఖ్య 22వ సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా మహిళా సమాఖ్య భవనంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మహిళలు వ్యాపారరీత్యా మరింత అభివృద్ధి సాధించడమే కాకుండా జిల్లాకు ఒక గుర్తింపును తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రతి వస్తువును మహిళా సంఘాలు మార్కెట్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలు ఆర్జిస్తున్న లాభాలు రెండింతలు పెరగాలి, మహిళలు సివిల్ పనుల కాంట్రాక్టుల్లో సైతం ప్రవేశం చేయవచ్చని సూచించారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రవేశించే శక్తియుక్తులు ఉన్నాయని వాటిని గ్రహించాలని ఆయన సూచించారు సమాజాన్ని మహిళలే నడిపిస్తున్నారని, స్వయం సహాయక సంఘ సభ్యులు బ్యాంకులకు దీటుగా వ్యవహారాలను నడిపిస్తున్నారని ఆయన కితాబ్బి ఇచ్చారు. తాము నిర్వహిస్తున్న వ్యాపార కార్యకలాపాలను సైతం అద్భుతంగా చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ప్రతి ఒక్కరూ ఆర్థిక సుస్థిరత సాధించాలని ఆయన పేర్కొన్నారు. మహిళలు సంఘాలుగా, వ్యక్తిగతంగా ఆర్థికంగా బలోపేతం కావలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆయిల్ పామ్, కోళ్ల పెంపకం, కూరగాయల పెంపకం, డ్రాగన్ ఫ్రూట్ పెంపకం వంటి వ్యవసాయ కార్యకలాపాలతో పాటు ఊదొత్తుల తయారీ, టైలరింగ్ బ్యూటీషియన్ వంటి వ్యవసాయేతర రంగాల్లోనూ అందె వేసిన చేయిగా ఎదగవచ్చని ఆయన అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాల ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చని తద్వారా మంచి లాభాలు సాధించవచ్చని సూచించారు. ప్రతి మహిళ ఏడాదికి కనీసం రెండు మూడు లక్షల రూపాయల ఆదాయం ఆర్జించాలని అన్నారు. సభ్యులుగా లేని వారికి కూడా అవగాహన కల్పించి ఆర్థిక ఉన్నతికి పాటుపడాలని చెప్పారు. సామాజిక బాధ్యతగా కూడా స్త్రీలు ముందుకు సాగాలని సూచించారు. సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అలాగే ప్రభుత్వం గుర్తులు కోసం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు తీసుకెళ్లాలని కోరారు. 18 సంవత్సరాల లోపు వయస్సులో గర్భం దాల్చడం వలన అనేక అనర్థాలు సంభవిస్తాయని, అనారోగ్య పరిస్థితులకు దారితీస్తుందని , బాల్య వివాహాలు జరక్కుండా తల్లిదండ్రులు అవగాహన తీసుకురావాలని అన్నారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై సత్యమనాయుడు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు దాదాపు శతశాతం తిరిగి చెల్లింపులను చేస్తున్నారని, జిల్లాలో మహిళా మార్ట్ లను నిర్వహించడం జరుగుతుందని, ఆరు నెలల సమయంలోనే రూ .79 లక్షల విలువగల మార్కెటింగ్ చేయడం జరిగిందని తెలిపారు.. వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా కొండచిపూర్లు, పసుపు, చింతపండు, అగర్బత్తి తదితర ఉత్పత్తులను చేస్తూ ఆదాయార్జనగా సంఘాలు నడుస్తున్నాయన్నారు.

# హమాలీలకు న్యాయం చేయాలి

### -ఎంపి కలిశెట్టికి వినతి పత్రం అందజేసిన కళాసీ సంఘం

### -బొబ్బిలిలో రైల్వే లోడింగ్ అన్లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలి

బొబ్బిలి, జూలై 16, మేజర్‌న్యూస్: బొబ్బిలి రైల్వే స్టేషన్ వద్ద వేగన్ లోడింగ్, అన్ లోడింగ్ గుడ్స్ షెడ్ కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ మంగళవారం బొబ్బిలి లో నియోజకవర్గ ఎమ్మెల్యే బేబీ నాయన ని, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ని బొబ్బిలి పట్టణ కళాసి సంఘం నాయకులు కలిసి మెమోరాండం సమర్పించారు. గత 40 సంవత్సరాల నుండి బొబ్బిలి కేంద్రంగా గూడ్స్ షెడ్ రైల్వే వేగన్ లోడింగ్, అన్లోడింగ్ సెంటర్ కొనసాగుతున్నదని ఈ పనుల పైన ఆధారపడి సుమారు 500 మంది హమాలీలు 200 మంది మోటర్ కార్మికులు బ్రతుకుతున్నారని తెలియజేశారు. టిట్లాగర్-విజయనగరం మధ్య మూడవ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో బొబ్బిలి గూడ్స్ షెడ్ పాయింట్ ను రద్దు చేయాలని చూస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని కోరారు. అదేవిధంగా బొబ్బిలి నుండి సాలూరు వెళ్లే మార్గం వైపు గూడ్స్ షెడ్ వేగన్ లోడింగ్, అన్లోడింగ్ పాయింట్ కు అనుకూలంగా రైల్వే స్థలం ఉందని అందువలన నిత్యవసర వస్తువుల రవాణాకు బొబ్బిలి సెంటర్ గ ఉంటుందని, బొబ్బిలి, బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్స్ మరియు ఎఫ్ సిఐ



గోడౌన్స్ కు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ సమస్య పై అనేకమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసామని తమరు వేగన్ పాయింట్ ను కొనసాగించి కళాసీలకు న్యాయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి పట్టణ కళాశీ సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ, ఉపాధ్యక్షులు పిరిడి అప్పారావు, సహాయ కార్యదర్శి ఎర్రబాల అప్పారావు, కోశాధికారి పైలా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఆవేటి వారాల సందడి



నరసన్నపేట, జూలై 16, మేజర్‌న్యూస్: నరసన్నపేట పట్టణంలో పలు వీధుల్లో అవేటి వారాలు సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మయ్యపేట, లచ్చుమన్నపేట, శివనగర్ కాలనీ, మార్కెట్ పరిసర వీధులలో, మారుతి నగర్, ప్రాంతాలలో సామూహికముగా అమ్మవారు సంబరాల్లో నిర్వహించార్ను మూర్రటలు సమర్పించుకొని ఘనంగా పూజలు చేశారు. వివిధ వేశాధారణలతో డప్పుల మోత, డాన్సులతో అంగరంగ వైభవంగా వారాల సందడి పట్టణ ప్రజలు నిర్వహించారు.

## ఆర్మీ ఉద్యోగి మృతి



మక్కువ, జూలై 16, మేజర్‌న్యూస్: మండలంలోని కన్నంపేట గ్రామానికి చెందిన తీళ్ల దినేష్ (34) మంగళవారం అనా రోగ్యంతో మృతి చెందారు. వివరాలు మేరకు కన్నంపేట గ్రామానికి చెందిన దినేష్ ఆర్మీలో (ఢిల్లీలో) విధులు నిర్వహిస్తున్నారు. వారం రోజులు క్రితం సెలవుపై స్వగ్రామానికి రాగ, సోమవారం నాడు విపరీతమైన కడుపు నొప్పితో బాధ పడుతున్న విషయాన్ని కుటుంబ సభ్యులు గమనించి విజయనగరంలోని తిరుమల హాస్పిటల్కు సోమవారం తీసుకొని వెళ్ళేరు. అక్కడే చికిత్స పొందుతూన్న ఆయన మంగళవారం ఉదయం మృతి చెందేరు. మృతునికి భార్య, అక్క, చెల్లి, తల్లిదండ్రులు వున్నారు.

## పుస్తక పఠనంతో లక్ష్య సాధన

### జిల్లా కలెక్టర్



పార్వతీపురం, జూలై 16, మేజర్‌న్యూస్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, యువతీ యువకులు లక్ష సాధనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మంగళ వారం స్థానిక చర్చి వీధిలో గల గ్రంథాలయాన్ని సందర్శించి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులతో మాట్లాడాలి వారిలో ధైర్యాన్ని నింపారు. ఎంత వరకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నవి, ఏ ఏ పోటీ పరీక్షలకు ఏ విధంగా సాధన చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. గ్రూప్ 1తోపాటు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నామని విద్యార్థులు కలెక్టర్ కు తెలపగా సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు నిరంతర కఠోర సాధన, ఏకాగ్రతతో ఎంచుకున్న లక్ష్య సాధన దిశగా కృషిచేసి ఉత్తమ ఫలితాలను పొందాలని ఆకాంక్షించారు. విషయ అన్వేషణను అలవారుచు కోవాలని, క్రమశిక్షణతో కూడిన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తనవంతుగా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. గ్రంథాలయ సహాయ లైబ్రేరియన్ దుర్గా ప్రసాద్, యువతీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి చేతికి పని సాకారం దిశగా

### -పలాస సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శిరీష కృషి

### -మంత్రి లోకేష్ విజ్ఞాపన సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్



పలాస, జూలై 16, మేజర్‌న్యూస్: పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకున్నారు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష . ప్రతి చేనుకు నీరు. ప్రతి చేతికి పని అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే వంశధార నీటిని రైతులకు అందించారు. అయితే ప్రతి చేతికి పని కల్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గారిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విజయవాడలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన వద్ద ప్రస్తావించారు. పలాస ప్రాంతంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తీర ప్రాంతం అధికంగా ఉందని, ప్రస్తుత తరంలోని మత్స్యకార యువత అధికంగా ఉందని సీమెన్, మర్చంట్ నేవీ అంశాలపై శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఉద్దాన ప్రాంతంలో జీడి, కొబ్బరి అధికంగా సాగవుతుందని, అందుకు అనుగుణంగా చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసినట్టయితే ఈ ప్రాంతంలోని మహిళలు అదనపు ఆదాయం పొంది ఆర్థికంగా పరిపుష్టి సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రతి చేతికి పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ఆమె ఆలోచనలను సావధానంగా విని, స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆమెతో పాటు పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఉన్నారు.

## వసతి గృహ విద్యార్థుల ప్రగతి పై దృష్టి సారించండి

### వసతి గృహ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే రమణమూర్తి



నరసన్నపేట, జూలై 16, మేజర్‌న్యూస్: విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు వసతి గృహాల వార్డెన్స్ శ్రద్ధ చూపించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మరియు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల అధికారులతో సమీక్ష నిర్వహించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతి గృహాల ప్రస్తుత పరిస్థితి మౌలిక సదుపాయాలు,పారిశుద్ధ్యం,వసతి గృహాల్లో భోజనం,అల్పాహారం, మెనూ, స్టడీ అవర్స్ నిర్వహణ,ఆరోగ్య పరిస్థితి అంశాలపై సమీక్ష నిర్వహించి,వద్యార్థుల మౌలిక వసతులతోపాటు, వారి విద్య రైతుపై దృష్టి సారించాలని వసతి గృహ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు నుండి ఎటువంటి విమర్శలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వసతి గృహాలలో చాముండేశ్వరి ఈ విద్యా సంవత్సరం బీసీ హాస్టల్లో 320 సీట్లు, ఎస్సీ హాస్టల్లో 109 సీట్లు భర్తీ చేశామని తెలియజేసిన వసతి గృహ నిర్వహణ అధికారి చాముండేశ్వరి. ఈ సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని సంక్షేమ వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

## సి ఎం ప్రకటన హర్షణీయం

### గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదల పై ఏ పి టి ఎఫ్ హర్షం



బొబ్బిలి, జూలై 16, మేజర్‌న్యూస్: సి పి ఎస్ ఉద్యోగ ,ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేసినలిజి పి ఎస్ అమలు నోటిఫికేషన్ నులిగౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలుపుదల కు ఆదేశాలు ఇవ్వటాన్ని ఏ పి టి ఎఫ్ హర్షాన్ని తెలియచేస్తున్నదని ఏ పి టి ఎఫ్ అకడమిక్ కన్వీనర్ జె సి రాజు తెలియచేసారు . ఎన్ జ ఓ హోమ్ లో శనివారం ఫెడరేషన్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. పత్రికల ద్వారా, గెజిట్ అమలు చేస్తున్నట్లు వెలువడిన ఉత్తర్వుల ద్వారా ,ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసనలు, ఆందోళనలు చేసిన నేపథ్యంలో విషయాన్ని తెలుసు కున్న సి ఎం తక్షణమే స్పందించి ఉత్తర్వులను నిలిపివేయమని చెప్పటం ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ప్రభుత్వం యెడల విశ్వాసం,నమ్మకం కలిగిందని అన్నారు. సి పి,ఎస్ ,జి పి ఎస్ రద్దుకు సానుకూలంగా స్పందించాలని పాత పింఛను విధానాన్ని అమలు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులు హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు ఉండాలని కోరారు. అలాగే 2003 డి ఎస్ సి వారికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పాత పింఛను విధానాన్ని అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు కొరతగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు బోధన కుంటుపడకుండా పని సర్దుబాటు ద్వారా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. సమావేశంలో ఎపిటిఎఫ్ ప్రతినిధులు జోగినాయుడు, ప్రవీణ్ కుమార్, సింహాచలం, రామకృష్ణ, ఎల్లయ్య, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర అవతారంలో జగన్నాధుని దర్శనం



చోడవరం, జులై 16, మేజర్‌న్యూస్: చోడవరం పట్టణంలో గల పురాతన ఆలయం శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామి ఆలయ ఆవరణ ఇంద్రజ్యమనం లో జగన్నాథ స్వామి వారు మంగళవారం శ్రీ వెంకటేశ్వర అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. జగన్నాథ స్వామి దశావతారాలలో భాగంగా రోజుకొక అలంకరణలో జగన్నాథ స్వామి వారు దర్శనం ఇస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం సీతారామచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని శ్రీ వేంకటేశ్వరునిగా అలంకరించి పూజలు జరిపారు. అనంతరం కలియుగ వెంకటేశ్వర దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కాగా నేడు జగన్నాథ స్వామి దశావతార మహోత్సవం ఆఖరి రోజు బుధవారం శయన ఏకాదశి సందర్భంగా శేష పాన్పుపై స్వామి వారు దర్శనం ఇవ్వనున్నారు.

## అవినీతికి పాల్పడుతున్న రెవెన్యూ అధికారులు

### -వీఆర్వో, డిప్యూటీ తహశీల్దార్ పై కలెక్టర్‌కు ఫిర్యాదు -సమాచార హక్కు చట్టం బేఖాతర్

అనకాపల్లి, జూలై 16, మేజర్‌న్యూస్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం, బాహాటంగా లంచాలు అడుగుతున్న మునగపాక రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ మునగపాక గ్రామం నుంచి పలువురు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసారు. అనంతరం వేగి వీరు నాయుడు, వేగి రాము సాయిబాబు నాయుడు, దొడ్డి ప్రశాంత్ కుమార్ లు మీడియాతో మాట్లాడారు. మునగపాక సచివాలయంలో వన్ బీ కోసం దరఖాస్తు చేసుకున్నామని, వీఆర్వో హిమబిందు ను ఎన్నిసార్లు అడిగినా ఆన్ లైన్ చేయలేదని, కనీసం ఫీల్డ్ ఎంక్వైరీ కూడా చేయలేదని అన్నారు. తప్పుడు సర్వే నంబర్లు, డిస్ ప్యూట్ లో ఉందంటూ రిజెక్ట్ చేసారని అన్నారు. తగు కారణాలు చెప్పాలని కోరితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని అన్నారు. భూమికి అవసరమైన పత్రాలు ఇచ్చినప్పటికీ రీ సర్వేలో నమోదు చేయకపోవడం వెనుక అవతలి వ్యక్తుల వద్ద పెద్ద మొత్తం తీసుకుని వారికి అనుకూలంగా ఆమె వ్యవహరిస్తుందనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఫీల్డ్ లోకి వచ్చి చుట్టుపక్కల రైతులను విచారించి, మా హక్కు పత్రాలను పరిశీలించకుండా జాప్యం చేయడం, తహశీల్దార్ కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం చూస్తుంటే పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఇదే విషయమై ఆమెను ప్రశ్నిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తాను జాగ్రత్త అంటూ బెదిరింపులకు పాల్పడుతుందని అన్నారు. దొడ్డి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ స్థానిక సమస్యలపై తాను సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరితూ పోస్టల్ లో పంపితే హిమబిందు తిప్పి పంపిందని అన్నారు. స్వయంగా సచివాలయంకు వెళ్లి ఇవ్వగా తాను స్వీకరించనని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ దురుసుగా సమాధానం చెప్పిందని అన్నారు. డిప్యూటీ తహశీల్దార్ వద్దకు వెడితే సీనియర్ అసిస్టెంట్ దగ్గరకు వెళ్లు అంటారని, ఆయన దగ్గరకు వెడితే డిప్యూటీ తహశీల్దార్ చెబితే తీసుకుంటానని డ్రామాలు ఆడుతున్నారని వాపోయారు. మునగపాక తహశీల్దార్ కార్యాలయం లో కాని సచివాలయం - లో కాని సమాచార హక్కు చట్టం ను అమలు చేయడం లేదని, ఈ విషయమై సమాచార హక్కు చట్టం కమిషనర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గతంలో కూడా వీఆర్వో హిమబిందు, డిప్యూటీ తహశీల్దార్ పై పలు ఆరోపణలు వచ్చాయని ఉన్నతాధికారులు చర్యలు చేపట్టలేదని అన్నారు.

## రవీంద్ర భారతి పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీవేడుక



అనకాపల్లి, జూలై 16, మేజర్‌న్యూస్: స్థానిక అనకాపల్లి రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుక మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎస్ ఐ బి. యమున విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకత్వ ప్రాముఖ్యతను, లక్షణాలను, విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ యం.యెస్.మణి మాట్లాడుతూ విద్యార్థి నాయకులకు చిత్తశుద్ధి, అంకితభావం, శ్రేష్టత, నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలని తెలియజేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నార్త్ఆంధ్ర జోనల్ ఇంచార్జ్ ఎన్.వెంకటేష్ కార్యక్రమములో పాల్గొని నూతనంగా నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు ప్రతిభావంతమైన నిర్ణయాలతో తోటి విద్యార్థులలో క్రమశిక్షణను, నైతిక విలువలను, బాధ్యతను పెంపొందింపజేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ జి. విజయ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బియ్యం కందిపప్పు తక్కువ ధరకు అమ్మకాలు

అనకాపల్లి ప్రతినిధి, జూలై 16, మేజర్‌న్యూస్: బహిరంగ మార్కెట్లో పెరిగిన బియ్యం కందిపప్పు ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నామని పౌరసరఫరాల శాఖ అధికారులు ఒక పర్యటనలో తెలిపారు .మరోవైపు సామాన్యులకు బియ్యం కందిపప్పు ధరలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామని వీటిలో భాగంగా రైతు బజార్లు మరియు పెద్ద సంస్థాగత రిటైల్ దుఖానాల వద్ద ప్రభుత్వం సరసమైన ధరలలో నాణ్యమైన సరుకులు లభ్యమయ్యే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. కందిపప్పు (దేశవాళి) కే.జి. 160, బియ్యం (స్టీమ్డ్ సోనా మసూరి) కే.జి. 49, బియ్యం (పచ్చి సోనా మసూరి) కే.జి. 48లు గా అనకాపల్లిలో ఏడు దుకాణాల్లోనూ ఎలమంచిలి లో రెండు దుకాణం దుకాణాల్లోనూ నర్సీపట్నంలో రెండు దుకాణాల్లో బుచ్చయ్యపేట మండలంలో గల వడ్డాది లో రెండు దుకాణాల్లోనూ చోడవరంలో ఐదు దుకాణాల్లోనూ ప్రభుత్వ నిబంధనల మేరకు తక్కువ ధరకే బియ్యం కందిపప్పు వినియోగదారులకు అమ్మకాల జరగనున్నాయని తెలిపారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రకటనలో కోరారు.

## నిస్వార్థ జర్నలిస్టు సేవకుడు నారాయణన్

### అభినందించిన సీతంరాజు సుధాకర్



విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్: నిస్వార్ధ జర్నలిస్టు సేవకునిగా నారాయణన్ చేస్తున్న సేవలు అభినందనీయమని టీడీపీ దక్షిణ నియోజక వర్గ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులుగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన పోతుమహంతి నారాయణ్‌ను మంగళవారం పలువురు నేతలు అభినందించారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి సీతంరాజు సుధాకర్ ఆయన కార్యాలయంలో నారాయణన్‌ను శాలువాతో సత్కరించి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని అభినందించారు. సుదీర్ఘ కాలంగా జర్నలిస్టుల అభివృద్ధికి నారాయణన్ చేస్తున్న సేవలు మరువలేనివని పేర్కొన్నారు. నారాయణన్‌ను సత్కరించి అభినందించిన వారిలో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 35 వ వార్డు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి మున్నం బాలాజీ తదితరులున్నారు.

## బిపిఎమ్‌గా ప్రభాకర్ మంచి సేవలు అందించారు

### తాటితూరు సర్పంచ్ సిరిగిడి సంతోషి

భీమునిపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్: భీమిలి మండలం తాటితూరు బ్రాంచ్ పోస్టుమాస్టర్ గా దుంపల ప్రభాకర్ మంచి సేవలు అందించారని సర్పంచ్ సిరిగిడి సంతోషి చెప్పారు. 31 సంవత్సరాలు బి. పి. ఎమ్. గా సేవలందించిన దుంపల ప్రబాకర్, నాగమణి దంపతులను తగరపువలస పోస్టుఆఫీస్ లో సిబ్బంది , పోస్టుమాస్టర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా సర్పంచ్ సిరిగిడి సంతోషి, ఈశ్వరరావు దంపతులు బి.పి.ఎం. ప్రభాకర్ ను సత్కరించారు. పోస్టల్ సిబ్బంది పరంగా ఇన్స్పెక్టర్ ఆఫ్ పోస్టల్ డి. జగదీశ్వరరావు, పోస్టు మాస్టర్ ఎన్. ఆదినారాయణ, బి. చంద్రశేఖర్ సత్కరించారు. ఈ సందర్బంగా పోస్టల్ ఇన్స్పెక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ దుంపల ప్రభాకర్ నిజాయితీగా ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరం అందించారన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్.



అప్పలరమణ, బి. పి. ఎమ్. లు ఎ. సుబ్బారావు, జి. వి. ఎన్.రావు, కె. ఎస్. ఎన్. రాజు, కనక మహాలక్ష్మి, బి. వరలక్ష్మి, పల్లా వెంకట రావు, దళిత నాయకుడు రవ్వ ఈశ్వరరావు, తాటితూరు రిటైర్డ్ హెచ్. ఎమ్. గోపాలరావు, పోస్టల్ ఏజెంట్ ఎస్. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జీవిఎంసీ కమీషనర్, ఏయు విసిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

### ప్రభుత్వానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి



భీమునిపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్: అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న జీవిఎంసీ కమీషనర్ సాయికాంత్ వర్మ, ఏయు వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డిపై సమగ్ర దర్యాప్తుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. పవిత్ర విద్యాలయాన్ని వైసిపీ కార్యాలయంగా మార్చడమే కాకుండా ఎన్నో అవకతవకలు జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై ఏయు విసి ప్రసాదరెడ్డిపై విచారణకు ఆదేశాలు జారీచేసేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ చూపాలని అన్నారు. అదేవిదంగా ఉన్నతమైన ఐఏఎస్ చదువుకొని విశాఖ గ్రేటర్ కమీషనర్ గా క్రిందటి ఏడాది ఏప్రిల్ నెలలో బాధ్యతలు చేపట్టిన సాయికాంత్ వర్మపై కూడా అసాధారణ ఆరోపణలు వెలు వెత్తుతున్నాయని అన్నారు.

వైసిపీ కి కొమ్ము కాస్తూ బదిలీ ఉత్తర్వులు వచ్చిన తరువాత కీలక ఫైళ్లపై సంతకాలు చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారన్న దానిపై కూడా విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసారు. ఉన్నతమైన స్థానాల్లో ఉన్నవారు తప్పులు చేస్తే, వారు తప్పు చేశారని తెలిసికూడా మౌనంగా ఊరుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. సామాన్యులు తప్పు చేస్తే ఏ విధంగా అయితే సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులు చర్యలు చేపడతారో ఆవిధంగా ఉన్నతమైన స్థానాల్లో ఉన్నవారు తప్పు చేసినా శిక్షలో మార్పు ఉండకూడదని, అప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై మంచి అభిప్రాయం ఉంటుందని అన్నారు. ఎవరూ ఊహించని మెజారిటీ కూటమి ప్రభుత్వంకి వచ్చిందని, నారా చంద్రబాబు నాయుడు అనే శక్తి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునుండి ప్రజల్లో ఒక ఆశాభావం ఉందని దానిని వమ్ము చేయొద్దని అన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు కాదని, తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాలని గంటా నూకరాజు అన్నారు.

## ప్రతి పిల్లవానిపైన పర్యవేక్షణ ఉండాలి

### -డ్రాపౌట్ల తోనే అనర్థాలు -రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పా రావు

విజయనగరం బ్యూరో, జులై 16, మేజర్‌న్యూస్: పిల్లల ప్రవర్తన పై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పా రావు తెలిపారు. సోషల్ మీడియా ప్రభావం వలన ప్రస్తుతం తల్లిదండ్రులతో పిల్లలకు దూరం పెరిగిపోతుందని, పిల్లలు ఏం చేస్తున్నారో కనిపెట్టలేక పోతున్నారని పెర్కొన్నారు. బాలల పట్ల మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధం పై జాయింట్ ఏక్షన్ ప్లాన్ అమలు పై జిల్లా అధికారులతో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మత్తు పదార్థాల నిరోధానికి శాఖల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసి అమలు చేయాలని, జిల్లా అధికారులు తమ సలహాలు, సూచనలను అందజేస్తే ప్రభుత్వానికి సిఫార్సు చేయడం జరుగుతుందని తెలిపారు. 3 నెలల తర్వాత వాటి ఫలితాలను మరోసారి చర్చించుకొని అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం తో చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పంచాయతి స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఈ విషయం పై చర్చ జరగాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. గ్రామీణ స్థాయి లో డి.ఆర్.డి ఎ, మెప్మా ఆధ్వర్యం లో జరుగుతున్న డ్వాక్రా సమావేశాలలో మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల పై ఎజెండా గా చేర్చి చర్చ జరగాలన్నారు. హోర్డింగ్ ల ద్వారా విస్తృత ప్రచారం జరగాలని, మున్సిపల్, పంచాయతి, విద్యా శాఖలు కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గోండు సీతారాం మాట్లాడుతూ ప్రధానంగా పాఠశాలల్లో డ్రాప్ అవుట్ల వల్లనే అనేక అనర్థాలు జరుగుతున్నాయని చదువు మానేసి స్వేచ్ఛగా తిరుగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని



విద్యా శాఖాధికారి డ్రాప్ అవుట్ల ను తగ్గించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, బడికి రాని పిల్లల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థుల పై కన్నేసి ఉంచాలని, మద్యం, గంజాయి వంటి పదార్థాలను విక్రయించకుండా చుట్టూ ప్రక్కల గట్టి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా అర్బన్ లో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు బెగ్గింగ్ ముసుగులో జరుగుతున్నాయని, వీరి పట్ల అప్రమతంగా ఉండాలని సూచించారు. పోలీస్, మున్సిపల్ కమిషనర్లు దృష్టి పెట్టాలని అన్నారు.

ఈ సమావేశం లో ఇంచార్జ్ డి.ఆర్.ఓ సుమబాల, బాల సంక్షేమ కమిటి ఛైర్పర్సన్ హిమబిందు, ఐ.సి.డి.ఎస్ పి.డి శాంతకుమారి, డి.ఆర్.డి.ఎ , మెప్మా పి.డి లు కళ్యాణ చక్రవర్తి, సుధాకర రావు, డి.ఎం.హెచ్ ఓ డా.భాస్కర రావు, డి.ఈ.ఓ ప్రేమ కుమార్, పంచాయతి అధికారి శ్రీధర్ రాజ, డిస్ట్రిక్ట్ బి సి వెల్ఫేర్ అధికారి సందీప్, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ అధికారి శరత్ కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటి పెంచుదాం

### -భవిష్యత్తు తరాల కోసం సామాజిక వనాలు పెంచుదాం -జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత -శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేద్దాం -ఎస్ భీంరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, వ్యూస్ ఎన్జిఒ



విశాఖపట్నం, జులై 16, మేజర్‌న్యూస్: ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటి పెంచుదాం అని వ్యూస్ ఎన్ జి ఒ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ భీంరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ఎంవిపి కాలనీ లోని సమత డిగ్రీ కళాశాలలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. తమ సంస్థ ఆస్ట్రేలియన్ ఎంబసీ సహాయం తో పని చేస్తుంది అన్నారు. భవిష్యత్తు తరాల కోసం సామాజిక వనాలు పెంచుదామన్నారు. జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి కృషి చెయ్యాలి అని కోరారు. శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయడానికి విద్యార్థులు కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. సమతా కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో ఔషధ వనాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం, ప్రతి విద్యార్థి కనీసం పది మొక్కలు నాటి పెంచాలని కోరారు. సమస్త జీవరాశినీ కాపాడుకునేందుకు, పర్యావరణ హితంగా జీవించడానికి ప్రతీ విద్యార్థీ కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో టీచింగ్ ఫ్యాకల్టీ రాజా ప్రవీణ మాట్లాడుతూ తూర్పు కనుమలలో లభ్యమయ్యే అన్ని ఔషధ మొక్కలు సేకరించి పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. 40 శాతం నుండి 80 శాతం ప్రాణవాయువు ఇచ్చే సముద్రాల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. తాము విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశాల మీద అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ టీచింగ్ ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు, వ్యూస్ సంస్థ కో ఆర్డినేటర్ జె రాజేశ్వరి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 6న కలెక్టరేట్ల ముందు శాంతియుత నిరసనలు

### -ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు -ఈ నెల 20నుండి 30 తేది వరకు ప్రభుత్వ హాస్టల్లో నిద్రలు -పెండింగ్లో ఉన్న మెస్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలి

విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి ఆందోళనలు చేపట్టనున్నామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు అన్నారు. అల్లిపురం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్, సిపిఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి యు నాగరాజుతో కలసి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులతో ముఖాముఖి హాస్టల్ నిద్రలు నిర్వహిస్తున్నామని దీని ద్వారా విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6 వ తేదీన అన్ని జిల్లా కలెక్టరేట్ ముందు శాంతియుత ధర్నాలు నిర్వహించి విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. అలాగే గత ఏడు సంవత్సరాలుగా విద్యార్థులకు అందవలసిన దుప్పట్లు , ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు ఇవ్వలేదని అలాగే తొమ్మిది నెలలుగా మెస్ చార్జీలు విడుదల చెయ్యకపోవడంతో విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించడంలో ఆ యొక్క వార్డెన్స్ విఫలమవుతున్నారని దీనివల్ల విద్యార్థుల అనారోగ్యానికి గురయ్యి వాళ్ల విద్యాభ్యాసం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రభుత్వ హాస్టల్ కు సొంత భవనాలు కేటాయించాలని మెనూ సక్రమంగా అమలు చేయాలని హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.




డిగ్రీ ఆన్లైన్ అడ్మిషన్స్ వల్ల విద్యార్థులు కోరుకున్న కళాశాలలో సీట్లు పొందలేకపోతున్నారని కావున ఆన్లైన్ అడ్మిషన్స్ రద్దు చేయాలని అలాగే పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనివర్సిటీలు ప్రక్షాళన చేసి వాటి యొక్క స్వయం ప్రతిపత్తి కాపాడాలని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న వైస్ ఛాన్సలర్, రిజిస్టర్ పోస్టులతో పాటు ప్రొఫెసర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వానికి చేశారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కే. హేమానంద్, మధు, శివ,నాగేష్ పాల్గొన్నారు.

## వారాహి మాత రూపంలో శ్రీ పరదేశమ్మ అమ్మవారి అలంకరణం



అక్కయ్యపాలెం, జూలై 16, మేజర్‌న్యూస్: స్థానిక జీవీఎంసీ 42వ వార్డు తాటి చెట్ల పాలెం, రైల్వే న్యూ కాలనీ, ప్రాంతంలో ఇల వేల్పు శ్రీ పరదేశమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా మంగళవారం వారాహి మాత అలంకరణ ఆలయ పూజారి అనిల్ భవాని ఆధ్వర్యంలో, శాకంబరి అలంకరణలో , భాగంగా శక్తి స్వరూపిణి, శ్రీ వారాహి మాత రూపంలో, దర్శనమిస్తూ భక్తులు యూకోచామునించి అమ్మవారిని దర్శించుకొని పసుపు కుంకు సమర్పించి కోరిన కోరికలను తీర్చుకున్నారు, ఆలయంలో మహిళలు కోలాటాలతో సందడి చేశారు ఈ కార్యక్రమంలో శ్రీ పరదేశమ్మ అమ్మవారి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అనాధ శావానికి అంత్యక్రియలు జరిపించిన : కంచర్ల



ఆరిలోవ, జులై 16, మేజర్‌న్యూస్: జీవీఎంసీ 11 వ వార్డు తోటగరువు బిఎన్ఆర్ కొండ పైన ఒక అనాధ మహిళ అనారోగ్యం తో మృతి చెందడంతో ఆ సంఘం ప్రెసిడెంట్ మాణిక్య రావు కొండమ్మ ఉపకార్ ట్రస్ట్ నీ ఆశ్రయించగా ఆ అంత్యక్రియల కు కావల్సిన డబ్బులను ఉపకార ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుత రావు అందజేశారు. ఎటువంటి సాయం కావాలన్నా ట్రస్ట్ ను సంప్రదించవలసిందిగా కోరారు.

## సూర్య కథనానికి స్పందన

### కొత్తూరు ఉపాధి ఆరోపణలు, అవకతవకలుపై విచారణ



అనకాపల్లి, జూలై 16, మేజర్‌న్యూస్: అనకాపల్లి మండలము కొత్తూరు గ్రామ పంచాయితీలో ఉపాధి హామీ పధకము మేట్ నాగమణి పై వచ్చిన ఆరోపణల విషయమై కొత్తూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఇన్చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఈఓఅర్డీ) ధర్మారావు, సహాయ పథక సంచాలకులు మణికుమార్, అనకాపల్లి క్లస్టర్ అధికారిణి ఏ పి ఓ సుప్రియ సమక్షంలో మంగళవారం విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకములో మేట్ నాగమణి పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేయగా ఈ గ్రామములో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ చాలా కాలముగా ఖాళీగా ఉండటం వలన, ఫీల్డ్ అసిస్టెంట్ భాద్యతలు మేట్ సక్రమముగా నిర్వహించలేకపోయినదని, ఒకరి పేరు మీద మరోకరికి ఉపాధి పని కల్పించడం ద్వారా సమస్యను గ్రామ నాయకులు లేవనెత్తడం జరిగినదని అన్నారు. ఈ విచారణా సమక్షములో మేట్ నాగమణి మేట్ విధులకు దూరంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తూ, త్వరితగతిన ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ భర్తీకి తగు చర్యలు గైకొనాలని గ్రామ నాయకులు కోరరని అన్నారు. తదనుగుణముగా మేట్ నాగమణిని విధులకు దూరంగా ఉంచాలని, ఫీల్డ్ అసిస్టెంట్ భర్తీకి త్వతితగతిన గ్రామ పంచాయితీ సకారముతో నియమ నిబంధనలు అనుగుణముగా ప్రపోజల్ ను పథక సంచాలకులు, డ్వామా, అనకాపల్లి వారికి పంపాలని, ఎంక్వయిరీ అధికారులు లేఖలో పేర్కొన్నారు. ఉపాధి హామీలో ఏ విధమైన అవకతవకలు ఉన్న వాటిని స్పష్టముగా తెలియజేసినట్లయితే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గ్రామ నాయకులకు ఎంక్వయిరీలో విచారణ అధికారులు తెలియజేసారు. ఈ విచారణకు గ్రామ స్థాయి నాయకులు, వార్డు సభ్యులు, మేట్ నాగమణి, ఇ.జి.ఎస్ సిబ్బంది హాజరయ్యారు.

## పడమటమ్మ తల్లిని దర్శించిన భరత్ కుమార్



అనకాపల్లి, జూలై 17, మేజర్‌న్యూస్: మండలంలోని కుంద్రం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పడమటమ్మ తల్లి పండగ మహోత్సవం సందర్భంగా మంగళవారం అనకాపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖాధికారిణి ఆకస్మిక తనిఖీ



భీమునిపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్: విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధి కారిణి ఎల్.చంద్రకళ భీమునిపట్నం మండల విద్యాశాఖా కార్యాలయాన్ని సందర్శించారు. స్టూడెంట్స్ కిట్ స్టాక్ పాయింట్ ను పరిశీలించారు. లోని అన్ని పాఠశాలలకు స్టూడెంట్స్ కిట్ అందిందో లేదో అని ఆరా తీసి రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. స్టూడెంట్స్ కిట్టు గురించి మండల విద్యాశాఖాధికారుణిలు ఎం. శివరాణి, అట్టాడ జయప్రద లు చంద్రకళకు వివరించారు. పాఠశాలలకు అన్ని సక్రమంగా అందాయని తెలియజేశారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు చిప్పాడ, చిట్టివలస (బాయ్స్) సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థులందరికీ స్టూడెంట్స్ కిట్ అందిందా లేదా ఆరా తీసి అందరికీ అందాయని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలు చక్కగా ఆకలింపు చేసుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. జూనియర్ కళాశాలలో కూడా విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్ అందిందా లేదా అని అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు.చంద్రకళ తో పాటు స్టూడెంట్స్ కిట్ నోడల్ అధికారి అప్పలనాయుడు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అయ్యన్న స్కూల్‌కు జాతీయస్థాయిలో గోల్డెన్ స్కూల్ అవార్డు




**కె.కోటపాడు, జూలై 16, మేజర్‌న్యూస్:** ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో ర్యాంకులు, పతకాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న అయ్యన్న స్కూల్ కు 2023-24సంవత్సరానికి జాతీయ స్థాయి "గోల్డెన్ స్కూల్" అవార్డు దక్కడం హర్షణీయం అని స్థానిక ఎస్.ఐ.లక్ష్మీనారాయణ అన్నారు. అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో జరిగిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్.ఐ.లక్ష్మీనారాయణ స్కూల్ డైరెక్టర్ కు గోల్డెన్ స్కూల్ అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.మాట్లాడుతూ, ప్రముఖ క్రీడాకారిణి, ఒలిపియాడ్ ఛాంపియన్ పి.టి.ఉష చే నిర్వహించబడుతున్న ఇండియన్ టాలెంట్ ఒలిపియాడ్ అయ్యన్న స్కూల్ కు అవార్డు ఇవ్వడం అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంతంలో చక్కటి మౌలిక వసతులతో ఉత్తమ విద్యను అందిస్తున్న అయ్యన్న స్కూల్ విద్యార్థులపాలిట వరంగా భావించాలని ఎస్.ఐ.లక్ష్మీ నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మరో ప్రత్యేక అతిథి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్న అయ్యన్న స్కూల్ గోల్డెన్ స్కూల్ అవార్డును అందుకోవడం శుభ పరిణామం అన్నారు. ఇవేకాకుండా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపయోగపడే పలు పోటీ పరీక్షలు అయ్యన్న స్కూల్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీంకు ఎస్.ఐ.లక్ష్మీ నారాయణ, సత్యనారాయణ మూర్తి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

## స్కోడా ఎస్‌యువి త్వరలో ఆవిష్కరణ

**విశాఖపట్నం,** ఆకర్షించే భద్రతా ప్రమాణాలతో స్కోడా కార్లలో సరికొత్త ఎస్.యు.వి త్వరలో మార్కెట్ లోకి రాబోతుందని మీడియా ప్రతినిధి తెలిపారు త్వరలో స్కోడా ఆటో ప్రపంచవ్యాప్తంగా దాని 129వ వార్షికోత్సవం జరుపుకోబో తోందని. అదే సమయంలో భారతదేశంలో 24వ వార్షికోత్సవం జరగనుందని ఈ సందర్భంగా 2024లో కొత్త కాంపాక్ట్ ఎస్ యు వి ప్రకటనతో వినియోగదారులకు అద్భుతమైన కారుని అందించబోతోందని స్కోడా ఆటో ఇండియా, దీనికి సంబంధించి స్కోడా ఆటో ఇండియా సరికొత్త కారు యొక్క రెండో గ్లింప్స్ ని విడుదల చేసిందన్నారు ఎస్.యువి డిజైన్ టీజర్ విడుదల సందర్భంగా స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జానెబా మాట్లాడుతూ మా సరికొత్త ఎస్ యు వి ప్రకటనతో 2024 ఏడాదిని ప్రారంభించామన్నారు కొత్త కాంపాక్ట్ ఎస్ యు వి భారతీయ రోడ్లపై యూరోపియన్ టెక్నాలజీని సరికొత్తగా ఆవిష్కరిస్తుందని ఈ సరికొత్త వాహనంతో కొత్త వినియోగదారులను తీసుకురావడానికి కంపెనీ పూర్తిగా కొత్త మార్కెట్లను లక్ష్యంగా చేసుకుందన్నారు.

### రవీంద్ర భారతి పాఠశాలలో
## ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీవేడుక



**నర్సీపట్నం అర్బన్, జూలై 16, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం శారద నగర్ లో రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుక జరిగింది.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వంజరి సత్యనారాయణ విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించారు. నాయకత్వ ప్రాముఖ్యతను, నాయకత్వ లక్షణాలను విశిష్టతను ముఖ్యఅతిథి విద్యార్థులకు తెలియజేశారు. రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ యం. య స్.మణి విద్యార్థి నాయకులకు చిత్తశుద్ధి, అంకితభావం మరియు శ్రేష్టత,నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలని తెలియజేస్తూ,వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.నార్త్ఆంధ్ర జోనల్ ఇంఛార్జ్ యన్ .వెంకటేష్ కార్యక్రమములో పాల్గొని నూతనంగా నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు ప్రతిభావంతమైన నిర్ణయాలతో తోటి విద్యార్థులలో క్రమశిక్షణను, నైతిక విలువలను,బాధ్యతను పెంపొందింపజేయాలని అన్నారు. కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాలు కె వి ఎస్, ఏజీఎం జి వి ఎస్ ఎన్ మూర్తి డివిజనల్ ఇన్చార్జ్ సిహెచ్ గోవింద్ విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్పీకర్ అయ్యన్నపాత్రుడను కలిసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



**నర్సీపట్నం అర్బన్, జూలై 16, మేజర్‌న్యూస్:** అమరావతి లో అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్ లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మర్యాద పూరకంగా కలిసి పూలగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.

### చోడవరంలో నేటి నుండి
## చండీ శ్రీ రుద్ర మహా యాగం



**చోడవరం, జూలై 16, మేజర్‌న్యూస్:** చోడవరం పట్టణంలోని స్వయంభు గౌరీశ్వర స్వామి సన్నిధిలో 17 బుధవారం (నేటి) నుండి 20వ తేదీ శనివారం వరకు శ్రీ లక్ష్మీ గణపతి నక్షత్ర నవగ్రహపూర్వక పంచాయతన సహిత చండీ శ్రీ రుద్రమహా యాగము నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ ఎన్ రాజు ప్రోత్సాహంతో లోక కళ్యాణార్థం త్రి రాత్ర దీక్ష గా శ్రీ రుద్ర మహాయాగం తొలిసారిగా చేపడుతున్నామన్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి బుధవారం ఉదయం 8 గంటలకు గణపతి పూజతో ప్రారంభం అవుతుందని, మధ్యాహ్నం మూడు గంటలకు అగ్ని మదనము, రుద్ర హెూమం నవగ్రహ మండప దేవత ఆరాధన ఉంటుందన్నారు. 18వ తేదీ గురువారం అష్ట ద్రవ్య లక్ష్మీ గణపతి హెూమం, పంచాయతన సహిత నవగ్రహ హెూమములు 9 నక్షత్ర జపమల హెూమములు, 19 శుక్రవారం స్త్రీలచే సామూహిక కుంకుమార్చన, శివపార్వతుల శాంతి కళ్యాణ మహెూత్సవం, పండిత ఆశీర్వచనాలతో ముగుస్తుందని భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

# పంట సాగుదారు పత్రంపై అవగాహన కార్యక్రమం

**భీమునిపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** భీమిలి మండలం స్థానిక తహసిల్దార్ ఆఫీస్ నందు పంట సాగుదారు హక్కు పత్రం పై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పంటలు సాగు చేసే ప్రతీ కౌలు రైతు పంట సాగు హక్కు పత్రం(క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డు ) భీమిలి తహసీల్దార్ ఆఫీసు నందు పొందుటకు భూ యజమాని యొక్క ఆధార్ కార్డు భూమి పాస్ బుక్ మరియు కౌలు రైతు యొక్క ఆధార్ కార్డు తో పాటు యజమాని మరియు కౌలు రైతు ఇద్దరు సంతకాలు చేసి ధ్రువీకరించిన అప్లికేషను ఫామ్ ను వి ఆర్ ఓ.గారికి గ్రామ సచివాలయం లో అందచేసిన యెడల కౌలు కార్డు జనరేట్ చేయడం జరుగుతుంది అని మండలం వ్యవసాయ అధికారి శివ కోమలి తెలిపారు. ఈ పంట సాగు దారు హక్కు పత్ర%శీ% (సి సి ఆర్ సి) ద్వారా కౌలు రైతులకు పంటపై నిర్దేశిత కాలానికి గరిష్టంగా 11 నెలల పాటు హక్కు ఉంటుంది.ఈ కౌలు కార్డు ద్వారా పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ మొదలైన వివిధ పథకాల కింద ప్రభుత్వం ద్వారా పొడిగించబడుతున్న ప్రయోజనాలను పొందేందుకు అర్హతను అందిస్తుంది. దీనికి గాను వ్యవసాయ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది గ్రామం లో కౌలు చేస్తున్న రైతులను గుర్తించి ప్రతీ ఒకరికి కౌలు కార్డు అందేలా చూడాలని మరియుఈ కౌలు కార్డు వలన భూయజమానికి భూమి పై హక్కులుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్రీను బాబు, వి ఆర్ ఓలను ఉద్దేశించి వారి వారి లక్ష్యాలను నిర్దేశిత సమయం లో పూర్తి చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి శివకోమలి, మండల వీఆర్వోలు, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలో రైవాడ నీరు విడుదలకు సన్నద్ధం

### ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి



**దేవరాపల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** రైవాడ ఆయకట్టు రైతులకు త్వరలో నీరు విడుదల చేసేందుకు సన్నద్ధం కావాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని ముసిడిపల్లి గ్రామంలో మంగళవారం మండల స్థాయి నాయకులతో మాట్లాడారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో రైతులు నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారని, దమ్ములకు అవసరమైన సాగునీరు విడుదలకు సన్నద్ధమవ్వాలన్నారు. దీనిపై రైవాడ జలాశయం డీ ఈ ఈ ఆర్. సత్యం నాయుడుతో చర్చించారు. రైవాడ నీటి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రైవాడ జలాశయం నీటిమట్టం 105.06 మీటర్లు ఉందన్నారు. దమ్ములకు అవసరమైన నీటి నిల్వ ఉందని, సాగునీటికి సరిపోతుందని డీ ఈ ఈ సత్యం నాయుడు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు పార్టీ నాయకులతో మాట్లాడుతూ గతంలో నీరు చెట్టు పనుల్లో రావలసిన బకాయిలపై సంబంధిత రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. దీనితోపాటు వివిధ అభివృద్ధి పనుల్లో రావలసిన బకాయిలపై దృష్టి పెడుతున్నట్లు దీన్ని పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు సోమిరెడ్డి గోవింద, పోతల పాత్రునాయుడు,చల్లా నానాజీ, కొమర బాబురావు, పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### భీమిలీ పోలీస్ స్టేషన్‌లో, సచివాలయంలో
## చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలు అందజేత



**భీమునిపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** భీమిలీ ఎన్డీయే ఎమ్మెల్యే గంటా శ్రీని వాస్ రావు, భీమిలీ జనసేన పార్టీ ఇంచార్జ్ పంచకర్ల సందీప్ ఆదేశాలు మేరకు 2వ వార్డు ప్రెసిడెంట్ నీలాపు శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో భీమునిపట్నం పోలీస్ స్టేషన్ కి భీమిలి 2వ వార్డ్ చిన్న బజార్ సచివాలయం కి భీమిలీ పోలీస్ స్టేషన్ సీఐ డి రమేష్ కి, హరీష్ ఎస్.ఐ. కి,రైటర్ అప్పలరాజుకి, చిన్న బజార్ సచివాల య సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి వర్యుల చిత్ర పటాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ 2వ వార్డు వైస్ ప్రెసిడెంట్ ఎమ్.ఎ.సత్యనారాయణ,జి.చిన్న జాయింట్ సెక్రటరీ గోవింద, ఎమ్.నర్సింగ్, జాయింట్ సెక్రటరీ ఎన్.నాగేశ్వర్ రావు, జాయింట్ సెక్రటరీ ఎన్.శేషు, జనసేన నాయకులు నాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ముసిడిపల్లిలో ఘనంగా చింతాలమ్మ పండుగ



**దేవరాపల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలోని ముసిడిపల్లి గ్రామంలో చింతాలమ్మ తల్లి ఒడ్డు పండుగ అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక మాజీ సర్పంచ్ సోమిరెడ్డి గోవింద ఆధ్వర్యంలో జరిగిన ఈ పండుగ మహెూత్సవంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. డప్పుల వాయిద్యాలు, కోలాటాలు నడుమ అమ్మవారి ఊరేగింపు మంగళవారం మధ్యాహ్నం వైభవంగా సాగింది. గ్రామ ప్రజలు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పసుపు కుంకాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బొడ్డు వెంకటరావు, రాయవరపు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రావివలసలో ఘనంగా వారాల పండుగ

**-పూజలు నిర్వహించిన జడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు**
**-ఆయా వీధులలో అమ్మవారి ఘటాలు ఊరేగింపు**



**గరుగుబిల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని రావివలస గ్రామంలో మంగ ళవారం దేశతల్లి, చింతలపోలమ్మ, వారాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఘటాలను మేళ తాళాలతో గ్రామంలోని ఆయా వీధులలో భారీగా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఘటాలు ఊరేగింపు సమయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. మంగళవారాలు సందర్భముగా అమ్మవారి ఘటాలు ఊరేగింపు నిర్వహించిన సమయం లో ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, గుంట్రెడ్డి సత్యనారా యణ, గుంట్రెడ్డి సురేష్ కుమార్, గుంట్రేడ్డి రాంబాబు, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధం గా ప్రతి సంవత్సరం వరి పంట ద మ్ములు ప్రారంభమయ్యే ముం దు మంగళ వారాలు పండుగను నిర్వహించు కోవడం ఆనవాయి తీగా వస్తుందని పలువురు తెలి పారు. గ్రామంలోని ఆయా వీధులలో అమ్మవారి ఘటాలు ఊరేగింపు అనంత రం గ్రామం సమీపంలోని అమ్మవారి గుడి వద్దకు వెళ్లి మొక్కులు చెల్లిం చుకున్నారు.

## రావుపల్లిలో ముగిసిన భజన కార్యక్రమం

**-తొలిదశమినుంచి ఆవిటి వరకు కార్యక్రమం**
**-సూర్యనారాయణశర్మ, మహేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం**



**గరుగుబిల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని రావుపల్లి గ్రామంలో జగన్నాథ స్వామి రథయాత్ర కార్యక్రమంలో భాగంగా తొలిదశమి నుంచి ఆవిటి వరకు ప్రతిరోజు సాయంకాలం శ్రీఉమారామలింగేశ్వర భజన బృందం గురువు అయిన బంకుపల్లి సూర్యనారాయణశర్మ, మరియు గ్రామపంచా యతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్)ల ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్ర మం సోమవారం రాత్రితో ముగిసింది. పూరి జగన్నాథ స్వామి బలరామ స్వామి వారి రథయాత్ర పర్వదినాలను పురస్కరించుకుని గ్రామంలోని ఆయా వీధుల్లోని రామమందిరాల్లో భజన కార్యక్రమంను నిర్వహిం చారు. ఈమేరకు రామాల యాల కమిటీల ఆహ్వానం మేరకు రామమందిరం వద్ద భజన కార్యక్రమంను నిర్వహించడం జరిగిందని ఈసందర్భంగా సూర్య నారాయణశర్మ తెలిపారు. ఈకార్య క్రమంలో భజన బృందం సభ్యులు చింతాడ తవిటాచారి, చింతాడ రుద్ర కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### హిందీ పరీక్షల రుసుము చెల్లించుటకు
## ఆఖరి తేదీ జూన్ 31

**భీమునిపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** దక్షిణ భారత హిందీ ప్రచార సభ, చెన్నై వారి హిందీ ప్రారంభిక పరీక్షలైన హిందీ పరిచయ్,ప్రాథమిక, మద్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31 తారీఖు బుధవారం వరకు పొడిగించడమైనది. అదే విధంగా హయ్యర్ పరీక్ష లైన రాష్ట్ర భాషా విశారద పూర్వార్ధ, ఉత్తరార్ధ, రాష్ట్ర బాషా విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర బాషా ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాషా ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 25 తారీఖు బుధవారం వరకు పొడిగించడ మైనది. ఈ సదవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని భీమిలి ఆదర్శ హిం దీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్ల సూర్య రామకృష్ణారావు మంగళ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 8985647419 వాట్సాప్ నెంబర్ 8985897419 నెంబర్లను సంప్రదించవలసినదిగా ఆయన కోరారు.

# పారిశుద్ధ్య వారోత్సవాలు విజయవంతం చేయాలి

**-ఎంపీడీవో పైల సూర్యనారాయణ, తహసిల్దార్ కె జయలు, వెల్లడి**
**-పారిశుద్ధ్య వారోత్సవాలు విజయవంతంపై సమావేశం**



**గరుగుబిల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్య వారోత్సవాలు విజయ వంతం అవుతాయని మండల పరిషత్ అధికారి పైల సూర్యనారా యణ అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగ ళవారం నుంచి వచ్చేనెల రెండ వతేదీ వరకు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య వారోత్సవాలను విజయవంతంగా నిర్వహిం చేందుకు ఆయా శాఖల అధి కారులతో సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుద్ధ్య వారో త్సవాలు విజయవంతంకు సంబం ధించి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి ప్రతిరోజు సాయంత్రం ఆరోజు చేపట్టిన కార్యక్రమ వివరాలను ఫోటోలతో పాటుగా పంపించాలని తెలిపారు. మండల తహసిల్దార్ కె జయ మాట్లాడుతూ పారిశుద్యం నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, బోజనం చేసే ముందు చేతులు పరిశుభ్రతపై ప్రజలకు, విద్యార్థులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వల గుంతలను పూడ్చి వేయాలని పేర్కొన్నారు. ఫాగింగ్ మిషన్లు సిద్ధంచేసుకో వాలని, రక్షిత మంచి నీటి పథకాలను శుభ్రం చేయాలని తెలిపారు. డ్రై డే, కార్యక్రమాలు నిర్వహించి ఇంటిలోపల చేపట్టే దోమల లార్వా నివారణ, నీటి నిల్వలను పారబోయుట వంటి కార్యక్రమాలలో ప్రజలను భాగ స్వామ్యులను చేయాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలిఆర్ డబ్ల్యు ఎస్ జే ఈ గోపి గౌరీశంకర్రావు, ఉపా ధి హామీ పథకం ఏపీవో మండల గౌరీనాథ్ తో పాటు అంగన్వాడి సిబ్బంది, వైద్యసిబ్బంది, పాల్గొ న్నారు.

## పారిశుద్ధ్య వారోత్సవాలు సందర్భముగా ర్యాలీ

**-మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అధికారులు**
**-ఎంపీడీవో సూర్యనారాయణ, తహసిల్దార్ కె జయ**



**గరుగుబిల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్య వారోత్సవాలు విజయ వంతం అవుతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పైల సూర్యనారాయణ అన్నారు. పారి శుద్ధ్య వారోత్సవాలు ప్రారంభం సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయం నుంచి బస్ స్టాండ్ వరకు మంగ ళవారం ఎంపీడీవో కార్యాలయం అధికారు లతో పాటు, అంగన్వాడి సిబ్బంది, వైద్య సిబ్బంది ఆధ్వర్యం లో ర్యాలీ నిర్వహించారు. ఈసంద ర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మంగళవారం నుంచి ప్రారంభమైన పారిశుద్ధ్య వారోత్సవాలు వచ్చే నెల రెండవ తేదీ వరకు నిర్వహించ ను న్నామని పేర్కొన్నారు. మండల తహసిల్దార్ కె జయ మాట్లాడుతూ పారిశుద్ధ్య వారోత్సవాలను విజయ వంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయడంతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఈకార్య క్రమంలో రావుపల్లి సర్పంచ్ బొ%శీ%తాడ మహేశ్వరరావు (మహేష్), రావివలస సర్పంచ్ బొత్స అప్పడు, ఈ ఓ పి ఆర్ డి ఎల్ గోపాలరావు, మండల ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ గోపి గౌరీశంకర్రావు, ఉపాధిహామీ పథకం ఏపీవో మండల గౌరీనాథ్, గృహ నిర్మాణశాఖ ఏ ఈ వంగపండు అఖి ల్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## లంపి స్కిన్ టీకాలు తప్పనిసరిగా వేయించండి

### పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్, ఎం.చంద్రశేఖర్



**చోడవరం, జూలై 16, మేజర్‌న్యూస్:** పాడి పశువులకు లంపి స్కిన్( ముద్ద చర్మవ్యాధి) శోకకుండా పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎం చంద్రశేఖర్ రైతులకు సూచించారు. మండలంలోని దుద్దుపాలెం గ్రామంలో ఎల్ ఎస్ డి జబ్బు టీ.కా కార్యక్రమం, కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఎన్.ఎల్.ఎమ్ మేకల షెడ్లను మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు లంపి స్కిన్ బారిన పడకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఆదేశించారు. అతి సూక్ష్మమైన వైరస్ పశువుల నుండి వేరొక పశువుకు కీటకాలు, శ్రవాలు కలుషితమైన గాలి తదితర వాటి వలన వేగంగా వ్యాపిస్తుందన్నారు. పశువుల శరీరం పైన బొడిపెలు లక్షణాలు వచ్చి జ్వరము, కళ్ళు, ముక్కు నుండి చొంగ కారడం జరుగుతుందని, మేత తినక పాల ఉత్పత్తి తగ్గి, పశువులోవ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది అన్నారు. ముందుగా ఈ లక్షణాలు గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రత తగ్గించి నష్టాన్ని చాలా వరకు నివారించవచ్చు అన్నారు. పశువులకు ఈ వ్యాధి సోకకుండా ముందుగా టీకాలు వేయించడం మేలని సూచించారు. ఈ కార్యక్రమంలో చోడవరం పశు వైద్యశాల ఏడి డాక్టర్ వి. చిట్టి నాయుడు, అడ్డూరు పశువైద్యాధికారి డాక్టర్ టీ. ప్రశాంత్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గోగు పంటసాగుపై రైతులకు అవగాహన సదస్సు

**-పాల్గొన్న జె సి ఐ రీజినల్ మేనేజర్ అరుణ్ -ఆధునిక వ్యవసాయ పరికరాలపై రైతులకు అవగాహన**




**గరుగుబిల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** అధిక విస్తీర్ణంలో గోగు పంటను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని జూట్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రామచర్ల అరుణ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గోగు పంట పండి స్తున్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆధునిక వ్యవసాయ పరికరాలు గోగు పంటలో కలుపు నివారణ, గోగు విత్తనాలు వేసే యంత్రాలపై రైతులకు జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన ప్రతినిధులు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్ ఎం అరుణ్ మాట్లాడుతూ ఈప్రాంతంలోని మెట్టు భూముల్లో విస్తారంగా గోగు పంటను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. అదేవిధంగా రైతులు పండించిన గోగునారను జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేయడం జరుగుతుందని ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన చందక దిలీప్, గవర సంపత్ కుమార్ , రైతులు రౌతు రామి నాయుడు , తుమ్మగుంట శ్రీరాములు నాయుడు, చందక లక్ష్ము%శీ%నాయు డు, చందక వెంకటేష్, చందక రామకృష్ణ, దాసరి వెంకటనాయు డు , తుమ్మగుంట రాము, తది తరులు పాల్గొన్నారు.

## కుటమీ నాయకుల చిత్రపటాల ఆవిష్కరణ



**ఆనందపురం, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలో బంటుపల్లి వారి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవా రం కూటమి నాయకులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను కార్యాలయంలో ఆవిష్కరించారు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోన పైడ్రాజు శ్రీను, కార్యదర్శి ప్రసాద్ కూటమి నాయకులు బంటుపల్లి శ్రీనివాసరావు ,బుజ్జి, ఆర్ నాగరాజు నరసింగరావు, మీసాల శ్రీను, సత్తిబాబు, సంతోష్ ,శ్రీను, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల పెంపుకు సంకల్పం ప్రోజెక్ట్



**బాడంగి, జూలై 16, మేజర్‌న్యూస్:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా సంకల్పం ప్రోజెక్ట్ కోఆర్డినేటర్ కె. శ్రీనివాసరావు లైఫ్ స్కిల్స్ తరగతులు జరుగుతున్న తీరును పరిశీలించటానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6,7,8 తరగతుల విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంచటానికి నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతీ పిల్లవానికి చదువుతో పాటు జీవన నైపుణ్యాలు చేకూర్చాలనే ప్రణాళికతో ఏపీ గవర్నమెంట్ ఎస్సీఆర్టీ మరియు మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సహకారంతో ఈ సంకల్పం ప్రాజెక్టును 3 సంవత్సరాల ప్రణాళికతో రూపొందించి మొదటి ఏడాది ఐదు లైఫ్ స్కిల్స్ ను 20 సెషన్స్ కరికులంలో నిర్వహించారు ఈ కార్యక్రమం రాష్ట్రంలో 1300 పాఠశాలలు మరియు మన విజయనగరం జిల్లాలో 50 పాఠశాలలో నిర్వహిస్తున్నారు రెండవ ఏడాదికి గాను రాష్ట్రంలో నూతనంగా 2600 పాఠశాలలను మన జిల్లాలో 100 పాఠశాలలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు ఈ జీవన నైపుణ్యాలను పాఠశాల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయుడు, ఒక ఏక్టివ్ టీచర్ నిర్వహిస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో పిడి బంగారునాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

## అమ్మకు ఇచ్చిన గౌరవం మొక్కలకు ఇవ్వండి

### జిల్లా సోషల్ ఫారెస్ట్ రేంజర్ గౌరేశు



**రావికమతం,జూలై 16, మేజర్‌న్యూస్:** అమ్మకు ఇచ్చిన గౌరవం ప్రతి చెట్టుకు ప్రతి ఒక్క మొక్కకు ఇవ్వాలని జిల్లా సోషల్ ఫారెస్ట్ రేంజర్ గౌరేశు పిలుపునిచ్చారు. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో కస్తూరిబా పాఠశాల, సిద్ధార్థ కాన్వెంట్లో సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో తల్లి చేసిన మేలు ప్రకృతిలో మనకు చెట్లు, మొక్కలు చేస్తాయని తెలిపారు. విద్యార్థులు మొక్కలను చెట్లుగా ఎదిగేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుంకర కొండలరావు, జి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు



**బాడంగి, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలోని ఏ ఒక్క గ్రామానికి కూడా నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబీ నాయన ఇచ్చిన ఆదేశాల మేరకు తూచా తప్పకుండా పనిచేస్తున్నాం అని గ్రామీణ నీటి సరఫరా విభాగం బాడంగి మండలం కాంట్రాక్టర్ పోల మహేశ్వర రావు అన్నారు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దపల్లి, తెంటువలస, పింద్రంగివలస గ్రామాలకు వెళ్లే త్రాగునీటి పీవీసి 180 ఎం ఎం పైపు,దయా 6 కేజీ/ సియం2 ఎంఎస్ పైపు లీకేజీ తెంటువలస లక్ష్మీపురం రెండు గ్రామాల జంక్షన్ వద్ద పైపు లీకేజీ అయింది అని మంగళవారం ఉదయం త్రాగునీరు సప్లై అయిన తర్వాత దాని మరమ్మత్తు పనులను చేపడుతున్నామని కంప్లింగు ప్రాబ్లం అయి ఉండవచ్చునని ఈరోజు ఏ సమయానికి అయినా సరే ఆ మరమ్మత్తులను పూర్తి చేసి రేపు ఉదయం త్రాగునీరు సప్లై ఆయా గ్రామాలకు ఇచ్చేటట్లు చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు.

## గదభపాలేం గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించండి



**రావికమతం, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలో గుడివాడ పంచాయతీ శివారు గదభపాలెనికి కనీస సౌకర్యాలు కల్పించాలని ఈ గ్రామ గిరిజనులు ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం చోడవరం ఎమ్మెల్యే కార్యాలయానికి గిరిజనులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను సత్కరించారు. తమ గ్రామానికి విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన కాలనీకి ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఎటువంటి సౌకర్యాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్డిప గ్రామ టిడిపి సీనియర్ కార్యకర్తలు గల్లా నాని బాబు, ఇంగలపు శివ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ పేరుతో మొక్కను నాటాలి



**రేగిడి, జూలై 16, మేజర్‌న్యూస్:** అమ్మ పేరుతో ఒక మొక్కను ప్రతి ఒక్కరూ నాటాలని ఎంఇఓ ప్రసాదరావు అన్నారు. డిఇఓ ఆదేశాలు మేరకు మంగళవారం కొండవలస మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణ కు పచ్చని చెట్లు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. కాలుష్యం వలన వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని దీని వలన జీవన మనుగడ దెబ్బ తింటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైకుంఠ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం పై అవగాహన ర్యాలీ

**సీతంపేట, జూలై 16, మేజర్‌న్యూస్:** పారిశుధ్యం పక్షోవ వారోత్స వాలు సందర్భంగా మంగళవారం సీతంపేట లో నిర్వహించారు. ఎం పిడి ఓ గీతాంజలి అధ్యక్ష త న జరిగిన ఈ ర్యాలీ లో గిరిజన సంక్షేమ ఈ ఈ సింహాచలం, ఏ పీఓ చినబాబుడిప్యూటీ డి ఈ ఓ నారాయుడు, ఏ టి డబ్ల్యూ ఓ మంగవేణి, సిడిపి ఓ రంగ లక్ష్మి,, ఎం పి పి ఆదినారాయణ హెచ్ ఎం లు చంద్ర రావు, సర్పంచి కళావతి, ఏ ఎం ఓ కోటి బాబు, కార్యదర్శి సుదర్శన్ రావు తదితర అధికారులు పాల్గొన్నారుతొలత సీతంపేట బస్ స్టాండ్ వద్దు మానవ హారం జరిపారు. మలేరియా, టైఫాడ్, డెంగీ వ్యాధులు ప్రబ లు ప్రతిఒక్కరు పరిసరాలు శుభ్రత పాటించాని ఎంపిడిఓ గీతాంజలి హితవు పలికారు.

## ఆకుల తంపరలో మంచినీటి సరఫరా పునరుద్ధరించండి

### -సమస్య పరిష్కారానికి కమిటీ ఏర్పాటు
### -జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సర్పంచ్ నాగల్ల అప్పన్న పిర్యాదు



**కొత్తూరు, జూలై 16, మేజర్‌న్యూస్:** కొత్తూరు మండలం ఆకులతంపర పంచాయితీ కేంద్రంలో గత రెండు ఏళ్ళు నిలిచి పోయిన రక్షిత మంచినీటి సరఫరా తిరిగి పునరుద్దరణ కు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు ఆకులతంపరసర్పంచ్ నాగల్ల అప్పన్న పిర్యాదు చేశారు రక్షితమంచినీటి పథకం నిర్మాణం చేసిన సమయం లోచల్లా రవికిరణ్ పొలంలో అతని అనుమతి తోపంపు హౌస్ నిర్మాణం చేపట్టి పంచాయతీ లో నీటిని సరఫరా చేశారు. రెండేళ్లు మంచినీరు సరఫరా నిరాటాంకం గా సాగింది. పంచాయతీ ఎన్నికల్లో గ్రామస్తుల మద్దత్తు ఇవ్వలేదన్న కక్ష తో పంపు హౌస్‌కు తాళం వేసాదని కలెక్టర్ కు సర్పంచ్ అప్పన్న తెలియ జేశారు. రవికిరణ్ అనుమతితో ఆయన స్థలం లో పంపు నిర్మించడం వలన పంపు హౌస్‌నిర్మించడం వలన పంచాయితీ ఎటువంటి నిర్ణయంతీసుకోలేక పోవడం వలన గ్రామస్తులకు రెండేళ్లుగా మంచినీరు సరఫరా చేయలేక పోతున్నామని సర్పంచ్ కలెక్టర్ కు పిర్యాదు చేశారు. పంపు హౌస్‌నిర్మాణం చేసిన స్థలం ఎక్వైరీ చేసి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ అప్పన్న కలెక్టర్ ను కోరారు. సమస్య పరిష్కారానికి కమిటీ ఏర్పాటుచేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీ లో టెక్కలిసబ్ కలెక్టర్, జిల్లా పంచాయితీ అధికారి ,ఆర్ డబ్ల్యూయస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సభ్యులు గా ఉంటారు.కమిటీ సభ్యులు ఆకులతంపర వెళ్లి సమస్య పరిష్కరిస్తారని కలెక్టర్ వెల్లడించారని సర్పంచ్ నాగల్ల తెలియజేశారు.

## అసాంఘిక శక్తులను ఏయూలోకి రానివ్వద్దు

### ఏయూ రిజిస్ట్రార్‌కి విశాఖపట్నం లాయర్స్ అసోసియేషన్ వినతి



**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయంలోకి అసాంఘిక శక్తులను, నేరారోపణ కేసులు ఉన్న వ్యక్తులను రానివ్వొద్దు అంటూ అ ఆ ఫౌండేషన్ తరపున విశాఖపట్నం లాయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. మేరకు మంగళవారం ఏయూ ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్ బాబు ను ఆ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బైపా అరుణ్ కుమార్, ప్రతినిధులు వై. చిన్న రావు, కె. రమణ, పి. శ్రీనివాసరావు, ఎంవిలక్ష్మి తదితరులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు వర్సిటీకి చెందిన కొంతమంది సహకారంతో యూనివర్సిటీలో చొరబడి అలజడి రేకెత్తిస్తూ విద్య వాతావరణం కలుషితం చేస్తున్నారన్నారు. యూనివర్శిటీకి చట్టబద్ధమైన సంబంధం లేని వ్యక్తులు క్యాంపస్, అడ్మినిస్ట్రేటివ్ భవనాల్లోకి ప్రవేశించడం, ఆటంకాలు సృష్టించడం చేస్తున్నారని ఆరోపించారు. కోటి జాన్, ఆరేటి మహేష్ అనే వ్యక్తులు యూనివర్సిటీ పరిపాలన భవనలోకి వచ్చి అక్కడ వాతావరణం చెడగొడుతున్నారని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువచ్చారు. ఆ వ్యక్తులు నేర కార్యకలాపాలకు పాల్పడ్డారని, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని గుర్తు చేశారు. గతంలో కోటి జాన్ సస్పెండ్ చేయబడ్డారని చెప్పారు. ఈ తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ, ఈ వ్యక్తులు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ భవనంలోకి ప్రవేశించి విశ్వవిద్యాలయ పరిపాలనకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, పలు వినతి పత్రాలు ఇస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. వీరితోపాటు వర్సిటీ హిందీ విభాగ ప్రొఫెసర్ ఆచార్య ఎన్ సత్యనారాయణ పై లైంగిక వేధింపులు ఫిర్యాదుకు సంబంధించి జాతీయ మహిళా కమిషన్ యూనివర్సిటీ అధికారులు స్వయంగా హాజరై వివరణ కోరిందని, ఈ విషయంపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ చొరవ తీసుకొని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ వ్యక్తులు చేస్తున్న తతంగం మొత్తం యూనివర్సిటీ విద్యావాతరాన్ని కలుషితం చేయడమే కాక కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు తెస్తుందని అన్నారు. ఈ అంశాలపై ఉన్నత విద్యా మండలికి, రాష్ట్ర గవర్నర్ దృష్టికి కూడా తీసుకు వెళ్తున్నామని, తక్షణమే స్పందించి యూనివర్సిటీ ప్రతిష్టం కాపాడవలసిందిగా రిజిస్ట్రార్ ను వారు కోరారు.

## వరుసగా దొంగతనాలకు పాల్పడ్డ ఇద్దరు దొంగలు అరెస్ట్



**బాడంగి, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలోని కామన్నవలస, గజరాయునవలస, ఆకులు కట్ట గ్రామాల్లో బంగారంను, దొంకిని వలస ఆర్ఎస్ లో బైక్ ను దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ ఐ ఆర్ జయంతి చాకచక్యంగా మంగళవారం ఆకులు కట్ట జంక్షన్ వద్ద పట్టుకొని అరెస్టు చేశారు పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి వారిద్దరి ది పార్వతీపురం మన్యం జిల్లాకు చెందినవారు గౌతమ్ గా పిలవబడే ఎం గోవిందరావు పార్వతీపురం మండలంలోని పిన్నింటి రామినాయుడు వలస గ్రామం మరొకరిది వరుణ్ గా పిలవబడే ఏ నరేష్ కొమరాడ మండలం పుదేశ్ గ్రామం వారి వద్ద నుంచి నాలుగు వివిధ కేసులకు సంబంధించిన 90 గ్రాములు బంగారంను నాలుగు గ్లామర్ బైక్ లను ఒక ఎన్ఫీల్డ్ బైకును స్వాధీనం చేసుకొని ఎస్ ఐ ఆర్ జయంతి అరెస్ట్ చేశారు వారు బాడంగి మండల పరిధిలో గల పలు గ్రామాల్లో గత కొన్ని నెలలుగా దొంగతనాలు చేశారని ఇద్దరు పాత నేరస్థులు అని ఆమె విలేకరులకు తెలిపారు బాడంగి ఎస్.ఐ శ్రీమతి ఆర్. జయంతి అరెస్టు చేసి వారి వద్ద నుండి చోరీ సొత్తు అయిన సుమారు 90 గ్రాముల బంగారు ఆభరణాలను మరియు ఐదు మోటార్ సైకిళ్లను స్వాధిన పరచుకుని వారిని రిమాండ్ కొరకు శ్రీ ఏ జె ఎఫ్ సి ఎం కోర్ట్ వారి ముందు హాజరు పరచి అనంతరం సబ్ జైలు, బొబ్బిలికి తరలించడం మైనదని ఎస్సై తెలిపారు దొంగలను చాకచక్యంగా పట్టుకోవడంతో ఎస్ ఐ ఆర్ జయంతిని బాడంగి పోలీస్ లనుఉన్నత పోలీస్ అధికారులు మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు ప్రజలు అభినందించారు

## బైకుపై గిరిజన గ్రామానికి వెళ్లిన ఎంపీ కలిసెట్టి



**రామభద్రపురం, జూలై 16, మేజర్‌న్యూస్:** మండల పర్యటనకు వచ్చిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కొండకెంగవ గ్రామం నుంచి బైకుపై జీలుకు వలస గిరిజన గ్రామానికి చేరుకున్నారు కొండకెంగవనుంచిజిలుకవలస గ్రామానికి రోడ్డు లేకపోవడంతో టిడిపి శ్రేణులతో కలిసి బైకుపై ఆ గ్రామానికి చేరుకున్నారు అలాగే రెండు గడ్డలు దాటుకుని పిల్లలు పాఠశాలలకు వెళుతున్న రోడ్డు పరిస్థితిని కూడా పరిశీలించారు అక్కడ జరిగిన మహిళలు ఈ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పట్టారు ముఖ్యంగా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జ్వరాలు గర్భిణీ స్త్రీలు వస్తున్నప్పుడు సకాలంలో తీసుకువెళ్లడంతో ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని అలాగే ఈ గ్రామం నుంచి జుమ్ము వలస గ్రామానికి విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో రెండు గడ్డలు దాటి వెళ్లడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు అలాగే తాగునీటి సమస్య కూడా గ్రామంలో ఎక్కువ ఉందన్నారు పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గిరిజన గ్రామాలు లేకపోవడంతో ఇక్కడ అభివృద్ధి కుంటుపడుతుందని ఈ సమస్య పరిష్కరించాలని ద ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులకు తెలిపిన ఫలితం లేకపోయిందని గిరిజనులు ఆయన దృష్టికి తెచ్చారు దీనిపై కూడా పార్లమెంట్లో చర్చిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు అలాగే తక్షణమే రోడ్డుకు జంగిల్ క్లియరెన్స్ చేయించలని హౌసింగ్ పై కూడా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు జీలుకు వలస నుంచి జమ్మి వలస పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులుఇక నుంచి కొండ కెంగువ పాఠశాలకు వెళ్లే చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ఆదేశించారు.

## ముగిసిన నౌపడ పాలపోలమ్మ తల్లి సంబరాలు



**సంతబొమ్మాళి, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలో నౌపడ గ్రామంలో ఆదివారం నుండి జరుగుతున్న పాల పోలమ్మ తల్లి గ్రామ దేవత బల్లోలా సంబరాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఆలయానికి వేకువజాము నుండే భక్తులు బారులుతీరారు. మహిళలు గుంపుగా ముర్రాటలు, ప్రసాదాలతో ఊరేగింపుగా వెళ్లి మమ్మేలు మాయమ్మ నౌపడ పోలమ్మ అని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం సంబరాలకు ఆఖరి రోజు కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గ్రామంలో యువకులంతా కలిసి సంబరాలు కొరకు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సేకరించిన విరాళాలు తో పాటు లేబర్ యూనియన్ ప్రోత్సాహంతో, గ్రామ పెద్దల సహకారంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా యువకులు సంబర మహోత్సవానికి అధిక ప్రోత్సాహంతో లేబర్ యూనియన్ అధ్వర్యంలో నిర్వహించడం వలన అనేక కార్యక్రమాలు చేపట్టడంతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులంతా అధిక సంఖ్యలో రావడంతో నౌపడలో సందడి నెలకొంది. మూడు రోజులుగా బుర్రకథ, పగటి వేషాలు, తోలుబొమ్మలాట మెగా డాన్సులు, , డీజే డాన్సులతో మూడు రోజులు గ్రామంలో భక్తులంతా ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. మంగళవారం తెల్లవారు జామునుండే పసుపు కుంకుమ, మొక్కుబడులు చెల్లించడం మురాటలతో ఊరేగింపు, తీర్థ ప్రసాదం స్వీకరించారు. భారీగా బాణాసంచా కాల్చారు. డ్రాలో గెలుపొందిన వారికి పోలమ్మ గుడి సన్నిధిలో బహుమతులు అందించారు. ప్రతి సంవత్సరం వ్యవసాయ పనులు మొదలైన తరువాత ఈ సంబరం నిర్వహించి వ్యవసాయం లాభసాటిగా ఉండాలని అమ్మవారికి రైతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సంబరాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొని భక్తులకు ఉదయం నుండే పులిహార, ప్రసాదం అందజేసారు. సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండేందుకు పోలమ్మ దీవించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. సాయంత్రం యువకులు డీజే తో డాన్స్ లు వేసి హోరెత్తించారు. ఎగ్జిబిషన్ చిన్నారులకు కను విందు చేసింది.

## పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభించిన మండల ప్రత్యేక అధికారి



**పాచిపెంట, జూలై 16, మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఆర్ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి ప్రారంభించారు. ఎంపీపీ బడ్నాన ప్రమీల, సర్పంచ్ పాచిపెంట సంతోషి ఎంపీడీవో పి లక్ష్మీకాంత్ ఇతర మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పారిశుధ్య వారోత్సవాలు, డెంగ్యూ మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల రెండో వైస్ ఎంపీపీ కోరిపిల్లి రవీంద్రనాథ్, పాచిపెంట ఎంపీటీసీ పల్లెడ ఉమామహేశ్వరరావు, ఉప సర్పంచ్ పల్లెడ వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ అరుకు వాణిజ్య విభాగం కార్యదర్శి పూసర్ల నరసింగరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొదటిలో మేల్కొంటే కుష్టి వ్యాధి పూర్తిగా నయం

### -జూలై 18 నుంచి పక్షం రోజులపాటు ప్రత్యేక సర్వే
### -అవగాహన ర్యాలీ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెల్లడి



**పూసపాటిరేగ, జూలై 16, మేజర్‌న్యూస్:** కుష్ఠ వ్యాధి అంటే మొదట్లో ప్రాణాంతకం వ్యాధిని భయపడే వారిని వ్యాధి సోకిన వారికి పూర్తిస్థాయి మందులు ఉన్నందువలన వాటిని నయం చేయవచ్చునని పిహెచ్సి వైద్యాధికారిణి ప్రమీల దేవి అన్నారు. స్థానిక పీహెచ్సీ ప్రాంగణంలో కుష్టి వ్యాధి తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రమీల దేవి మాట్లాడుతూ కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్నవారు నిర్భయంగా పీహెచ్సీ కి వస్తే ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మందుల ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. ఉంటూ పై ఉన్న మచ్చలకు స్పర్శ లేకపోవడం, శరీరంపై ఎర్రటి మచ్చలతో పాటు దద్దుర్లు వంటివి ఏర్పడి నొప్పి లేకుండా ఉండడం, నరాల్లో తిమ్మిర్లు వంటి ప్రాథమిక లక్షణాలు అన్నారు. జులై 18 నుంచి ఆగస్టు 2 వరకు పీహెచ్సీ పరిధిలో ఉన్న 9500 కుటుంబాలను ప్రత్యేక సర్వేను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతకుముందు పూసపాటిరేగలో కుష్టి వ్యాధి తీసుకోవలసిన జాగ్రత్తలపై ర్యాలీ కార్యక్రమం తో పాటు కుష్ఠ వ్యాధి పై పోస్టర్లకు కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈహెచ్ వైద్యాధికారినే ప్రమీల, వీఆర్వో రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది నానమ్మ, ఆర్ వి రమణ,, ఏ అన్నంలో ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఎల్లమ్మ తల్లి వారాలుః



**బాడంగి, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయితీ మధుర గ్రామమైనఎరుకలపాకలు గ్రామంలో మంగళవారం శ్రీ ఎల్లమ్మతల్లి వారాలను గజరాయన వలస ఎంపిటిసి పాలవలస గౌరు సర్పంచ్ పాలవలస పార్వతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలో శ్రీ ఎల్లమ్మ తల్లులు ఘటాలు తిరువీధుల్లో తిప్పారుపూజారులు భక్తులు మేళా తాళాలతో గ్రామ ప్రజలంతా కలిసి శ్రీ ఎల్లమ్మతల్లి వారాలను ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఉత్సాహంగా ఎరుకుల కులస్తులమంతా 120 కుటుంబాలు కూడా పెద్ద ఎత్తున ఆదివారం దేశమ్మతల్లికి, మంగళవారం శ్రీ ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకోవడం జరిగిందని గ్రామానికి ప్రజలకు మంచి జరగాలని తల్లికి మొక్కు చెల్లించడం జరిగిందని తమ కుటుంబంతో పాటు గ్రామ ప్రజలందరికీ మంచి జరగాలని ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో గ్రామ ప్రజలంతా ఉండాలని కోరుతూ శ్రీ ఎల్లమ్మతల్లి అమ్మవారిని ప్రార్థించినట్లు వారు తెలిపారు.

## దివ్యాంగులకు నేషనల్ స్కాలర్ షిప్స్

### ఏడి కవిత



**పార్వతీపురం రూరల్, జూలై 16, మేజర్‌న్యూస్:** దివ్యాంగ విద్యార్థులు నేషనల్ స్కాలర్ షిప్ కు అక్టోబరు 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు వయోవృద్ధులు శాఖ సహాయ సంచాలకులు కె కవిత అన్నారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారిత మత్రింత్వ శాఖ 2024-25 విద్యా సంవత్సరానికి నేషనల్ స్కాలర్ షిప్ లకు దరఖాస్తులు కోరుతుందని, ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, ఉన్నత చదువులకు ఉపకార వేతనాలకు దివ్యాంగ విద్యార్థులకు ధరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. పార్వతిపురం మన్యం జిల్లాలో గల దివ్యాంగ విద్యార్థులు నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ %ఊఊ.ఎఫ్త్రశీశ్రీఖతీ-ంష్ట్రఱజూం.స్త్రశీజ.ఱఅ% వెబ్ సైట్ లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రి మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆగష్టు 31వ తేదీ లోగా ధరఖాస్తు చేయాలని ఆమె అన్నారు. ఇంటర్మీడియట్ నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు అక్టోబరు 31వ తేదీ లోగా ధరఖాస్తు చేయాలని ఆమె చెప్పారు. దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## మాజీ సైనికుల సమస్యలను పార్లమెంటు సమావేశంలో గళం విప్పుతా ఎంపి కలిశెట్టి



**బొబ్బిలి, జూలై 16, మేజర్‌న్యూస్:** మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఎంపి అప్పలనాయుడు ను కోట దర్బార్ హాల్లో మంగళవారం బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబినాయన) శాలువాతో సత్కరించారు. అనంతరం వీర బొబ్బిలి మాజీ సైనిక సంఘం అధ్యక్షులు రేవళ్ళ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బొబ్బిలి పర్యటనలో వచ్చిన ఎంపీ అప్పలనాయుడు ని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే రంగారావు (బేబీ నాయన) సమక్షంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ట్రెజరర్ వి.ఎన్.శర్మ మాజీ సైనికుల సమస్యలను ఎంపీ తో వివరంగా తెలియ పరిచారు. ఆయన సానుకూలంగా స్పందించి మీ మాజీ సైనికుల యొక్క సమస్యలపై రిప్రెజెంటేషన్ ను లిఖితపూర్వకంగా ఇస్తే నేను పార్లమెంట్ లో గళం విప్పుతానని, మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గోవింద నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న నాటు సారా స్వాదినం



**మక్కువ, జూలై 16, మేజర్‌న్యూస్:** అక్రమంగా తరలిస్తున్న ఐదు లీటర్ల నాటు సారాను ఓ వ్యక్తి నుండి స్వాదినం చేసుకున్నట్లు యస్సై పి నరసింహామూర్తి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. వివరాలు యిలా వున్నాయి, మండలం ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతం కావడంతో పలు ప్రాంతాలవారు నాటు సారా వ్యాపారం చేస్తుండడం మండల ప్రాంతంలో ప్రతీ ఒక్కరికీ తెలిసిన విషయం.. ఇందులో భాగంగానే దత్తిరేజారు మండలానికి చెందిన అలజంగి సూరిబాబు అక్రమ నాటు సారా ఐదు లీటర్లుతో వస్తుండగా మండలపరిధిలోని మార్కొండపుట్టి సమీపంలో అరెస్టు చేసి నిందితుణ్ణి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## గ్రామ అభివృద్ధి పై మంత్రికి వినతి



సంతబొమ్మాళి, జులై 16, మేజర్‌న్యూస్: సంతబొమ్మాళి పంచాయితీ, వెంకటాపురం గ్రామం లో గల పలు సమస్యలను పరిష్కరించాలని , అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు రాష్ట్ర వ్యవసాయం, పాడి పరిశ్రమ పశుసంవర్ధక మత్స్యశాఖమాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు కు వినతిపత్రం అందించారు. గ్రామానికి కి చెందిన జన సైనికుడు గున్న మహేష్ తో పాటు పలువురు టిడిపి నాయకులు మంత్రి ని కలిసి గ్రామ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు.గ్రామం సిసి రోడ్లు నిర్మాణం, మురికి కాలువలు, తాగు నీటి సౌకర్యం, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు, విద్యుత్లో ఓల్టేజ్ సమస్యపరిష్కారం, చెరువుకు మెట్లు ఏర్పాటు తదితర అంశాలు మంత్రి కి వివరించారు.దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించి సమస్య లు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కర్రి దుర్యోధనరావు, బొడ్డ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

### కుసుమూరు ఇసుక రీచ్ పరిశీలించిన ఆర్డీవో సాయిశ్రీ



తెర్లాం, జులై 16, మేజర్‌న్యూస్:ఇసుక అక్రమ రవాణా జరిపితే కఠిన చర్యలు తప్పవని బొబ్బిలి ఆర్డీవో సాయిశ్రీ హెచ్చరించారు. మంగళవారం కుసుమూరు ఇసుక రీచ్ ను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని వారిపైన కేసులు తప్పవని మరల హెచ్చరించారు. ఎవరైనా ఇంటి ఖర్చు నిమిత్తం ఒకటి లేదా రెండు నాటు బండ్లు మాత్రమే తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సంభందిత అధికారులు ను ఆదేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎలాంటి అనుమతులు లేవని అనుమతి వచ్చేవరకు వేచి ఉండాల్సిందే నని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె వెంట తహసిల్దార్ రాజ్యలక్ష్మి హెచ్ డి.టి జి. భాస్కర రావు పోలీసు అధికారి పంచాయితీ సెక్రటరీ వీఆర్వో రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## డీజిపురం రైతు సేవా కేంద్రంలో ఎరువులు పంపిణీ



సంతబొమ్మాళి, జులై 16, మేజర్‌న్యూస్: మండలంలో దండుగోపాలపురం రైతు సేవాకేంద్రంలో మంగళవారం సబ్సిడీ పైఎరువులను రైతులుకు అందజేశారు.పంచాయతీ మాజీ సర్పంచ్ఈ ఆరంగి వసంత రావు, సంతబొమ్మాళి మండలం ఐటీడీపి అధ్యక్షులు బెండి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు అందించారు.రైతులకు కావలిసిన ఎరువులు సకాలంలో అందించి నందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు రైతులు ధన్యవాదములు తెలిపారు ఈ కార్యక్రమంలో బాలక కృష్ణరావు నాయుడు ,వ్యవసాయ సహాయకులు ఆనంద్ , పంచాయతీ సెక్రటరీ ఆరంగి మధు తదితరులు పాల్గొన్నారు.

## పాతరేగలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



రామభద్రపురం, జులై 16, మేజర్‌న్యూస్: మండల పరిధిలో పాత రేగ గ్రామపంచాయతీలో మంగళవారం పెద్ద ఎత్తున పారిశుద్ధ్య పనులు నిర్వహించారు వీధి కాలువలో పేరికిపోయిన చెత్తాచెదారం తొలగించి కాలువలను శుభ్రం చేశారు ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి ప్రతినిధి గొట్టాపు పైడిప్పు నాయుడు తెలిపారు అలాగే బీటింగు దోమల నివారణకు పా కింగ్ కూడా నిర్వహించామని అన్నారు గ్రామంలో అపరిశుద్ధ్య నిర్మూలించేందుకు ప్రజలు కూడా తన వంతు భాగస్వామ్ కావాలని అన్నారు.

## ఘనంగా పారిశుద్ధ్య వారోత్సవాలు



మక్కువ, జులై 16, మేజర్‌న్యూస్: మండలంలో పారిశుద్ధ్య వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో యంపిడివో పి దేవ్కుమార్ పారిశుద్ధ్య వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం మండలస్థాయి అధికారులు, సిబ్బంది, విద్యార్థులుతో ర్యాలీగా గ్రామ పురవీధుల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ, నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవ హారంగా ఏర్పడి ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పారిశుధ్యం పాటించాలన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుద్ధ్య కార్యక్రమం దోహదం చేస్తుందని అన్నారు. మహిళలు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆయన కోరేరు. పారిశుద్ధ్య వారోత్సవాలు ఈ నెల 16వ తేది నుండి వచ్చే నెల రెండవ తేదీ వరకు నిర్వహిస్థామన్నారు. ఇంటింటికి కరపత్రాల పంపిణీ, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 18వ తేదీన పారిశుధ్య నిర్వహణ అవగాహన సదస్సులు, విద్యాసంస్థల్లో విద్యార్థులకు కార్యక్రమం పై అవగాహన కల్పించుట, గ్రామపంచాయతీలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధి హామీ పథకం సంఘ సభ్యులకు పారిశుధ్య నిర్వహణపై సమన్వయ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుంధన్నారు. ప్రజలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ చోరి

కోటబొమ్మాళి, జూలై 16, మేజర్‌న్యూస్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగిన ఘటన మండలంలోని నారాయణవలసలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే నారాయణవలస ఎత్తిపోతల పథకంకు సంబందించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరికి పాల్పడ్డారని మంగళవారం విద్యుత్‌శాఖ ఏఈ గురుబెల్లి సురేష్ కుమార్ స్థానిక పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక ఎస్సై షేక్‌మహ్మద్ అలీ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కూటమి ప్రభుత్వం, 30 రోజుల్లో చేసిన, 30 కార్యక్రమాలు



వంగర, జులై 16, మేజర్‌న్యూస్:మాట తప్పని నాయకుడు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడనీ, రాష్ట్రంలో అధికారం చేపట్టిన ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లో30 హామీలకు శ్రీకారం చుట్టారని, నెరవేరుస్తున్నారని రాజాం నియోజక వర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మజ్జిగణపతి అన్నారు. మంగళ వారం నాడు ఆయన వంగర లో విలేఖర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 16,347 టీచర్ పోస్టులతో, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. వృద్ధాప్య, వితంతు పెన్షన్ రూ.4000 కి పెంచి ఒక్కొక్కరికీ 7000 వేలవంతున అందజేశామన్నారు. దివ్యాంగుల పెన్షన్ రెట్టింపు చేసి రూ.6000 కి పెంచామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామన్నారు .ఉచితఇసుక అమలు (కేవలం లోడింగ్, రవాణా చార్జీలు చెల్లిస్తే చాలు)చేశామన్నారు.రానున్న ఆగస్టు 15 నుంచి 183 అన్న క్యాంటీన్లు, డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ప్రారంభంచ నున్నామని వివరించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎర్ర చందనంపై ఉక్కుపాదం మోపి అందుకుకారకులు పై చర్యలు చేపట్టినట్లు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని అమరావతి నిర్మాణపుపనులు ప్రారంభమయ్యాయన్నారు.పోలవరం నిర్మాణం పునః ప్రారంభమయ్యాయని తెలిపారు. స్కిల్ సెన్సెస్ కసరత్తు ప్రారంభం కానున్నాయని వివరించారు.కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి, తల్లికి వందనం మార్గదర్శకాలు విడుదల చేశారనిపేర్కొన్నారు. జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాల స్థానంలో రాజముద్రతో పాసు పుస్తకాలుకు ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు అదేశాలు జారీచేశారనిపేర్కొన్నారు. పట్టిసీమ మొదలు పెట్టి, కృష్ణా డెల్టాకి నీరు విడుదల కు చర్యలుతీసు కున్నామన్నారు.16. 48 గంటల్లోనే అత్యాచారం చేసిన నిందితుల అరెస్ట్ చేసిదర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు పరిశీలించి, 2026కి పూర్తి చేయాలని ఆదేశం మేరకుపనులు జరుగుతున్నాయన్నారు. తిరుమల, తిరుపతి ప్రక్షాళన ప్రారంభం అయిందని ఆయన స్పష్టం చేశారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకి కేంద్రం అనుమతి ఇచ్చిందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన అందిన జీతాలు పడుతున్నాయని చెప్పారు. గతప్రభుత్వంలో జీతాలు లేక ఉద్యోగులు తీవ్ర.ఇబ్బందులు పడేవారనివిమర్శించారు ఏపీలో రూ.70 వేల కోట్ల పెట్టబడి పెడుతున్న బీపీఎల్ కంపెనీ తో వేలమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.రాజధానిలో యాక్సెల్ అర్ ఐ విద్యా సంస్థ అధినేత, 5ఏళ్ళతరువాత పలాసకు సాగు నీరు సరఫరా, 5 సంవత్సరాలు తరువాత పిఠాపురానికి పురుషోత్తపట్నం నీళ్ళు, ఒక్క వాట్సప్ కాల్‌తో 25 మంది దివ్యాంగ విద్యార్థులకు అండగా లోకేష్ నిలిచి సహకరించారన్నారు.ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, డ్రెస్ లు పంపిణీ, తెలంగాణాతో విభజన సమస్యలపై ముందడుగు వేసినట్లు స్పష్టంచేశారు. విజయవాడ తూర్పు బైపాస్‌కి కేంద్రం ఆమోదంపొందిందన్నారు నిత్యవసర ధరల నియంత్రణకు చర్యలు తీసుకొని రైతు బజార్లలో బియ్యం, కంది పప్పు తక్కువ రేట్లకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు.2 రోజుల ఢిల్లీ పర్యటనలో, ఏడుగురు మంత్రులు, ప్రధానితో రాష్ట్ర సమస్యలపై సమావేశమే రాష్ట్రానికి అవసరమైన నిధులు తదితర వంటివాటిపై ముఖ్యమంత్రి వారితో చర్చించారని పేర్కొన్నారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి



అరకులోయ, జులై 16, మేజర్‌న్యూస్: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అరకులోయ నియోజకవర్గం శాసనసభ్యుడు రేగం.మత్స్యలింగం ఆదేశించారు. అరకులోయ మండల కేంద్రానికి అనుకొని ఉన్న శరభగుడ కాలనీలోని ఆయన నివాసగృహంలో ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని గిరిజన గ్రామాలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి, రక్షిత మంచినీటి సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. అనేక గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో రహదారులు, మురుగు కాలువలు, మంచినీటి పథకాలు లేని చాలా గ్రామాలను తాము గుర్తించామని, ఆ గ్రామాల్లో ముందుగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల వారీగా జనాభాను దృష్టిలో పెట్టుకుని మౌలిక సౌకర్యాల కల్పనకు గాను వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని శాసనసభ్యుడు రేగం.మత్స్యలింగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలన మారింది పని తీరు మార్చుకోండి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

### సచివాలయ స్థాయిలోనే సమస్యల పరిష్కారం కావాలి-సిబ్బంది కొరతను తీరుస్తాంజోన్లుగా విభజించి సమీక్షలు -టీడీపీ నాయకులు, వార్డ్ ఇంచార్జిలకు ప్రాధాన్యం ఇవ్వాలి



శ్రీకాకుళం, జులై 16, మేజర్‌న్యూస్: నగర పంచాయితీని తలపిస్తున్న నగరాన్ని కార్పొరేషన్ స్థాయికి తగినట్టు రూపొందించేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. పాలన మారిన విషయం స్పష్టమయ్యేలా ఫలితాలు తీసుకురావాలన్నారు. కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని అయన సూచించారు. స్థానిక బాపూజీ కళామందిరంలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయాల ఇంచార్జిలు, టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే శంకర్, కమీషనర్ చల్లా ఓబులేషుతో కలసి మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, శ్రీకాకుళం నగరం కార్పొరేషన్ గా రూపాంతరం చెందినప్పటికి ఆ స్థాయి అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేసారు. మౌలిక సదుపాయాలకు దూరంగా నగర పంచాయితీని తలపించే విధంగా నగరం ఉందన్నారు. కార్పొరేషన్లో సిబ్బంది కూడా మున్సిపాలిటీ స్థాయిలోనే వున్నారని, స్థాయికి సరిపడే సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో పాలన మారిందని, అందుకు అనుగుణంగా సిబ్బంది పనితీరు మార్చుకోవాలని సుతిమెత్తగా చెప్పారు. తాము కక్ష సాధింపు చర్యలకు పోమని, అధికారులు, సచివాలయ సిబ్బంది అపోహలు వీడనాడి విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. టీడీపీ నాయకులు, వార్డ్ ఇంచార్జిలకు తగిన గౌరవం ఇవ్వాలని సూచించారు. సచివాలయ పరిధిలోని సమస్యలు అక్కడే పరిష్కారం అయ్యే విధంగా అడ్మిన్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 48 సచివాలయాలను నాలుగు జోన్లుగా ఏర్పాటు చేసి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. అదేవిధంగా విలీన పంచాయితీల పరిధిలో సచివాలయాల కు సైతం కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే నెలరోజులు పూర్తయ్యిందని, మరికొద్ది రోజుల్లోనే పాలన మారిన విషయం స్పష్టం అయ్యేలా అభివృద్ధి జరగాలని కోరారు. డివిజన్ ఇంచార్జిల ప్రతిపాదనల మేరకు అంచనాలు రూపొందించి ఇస్తే నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. త్వరలోనే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెనాయుడు సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నందున నగరంలోని ప్రధాన సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, డివిజన్ ఇంచార్జిలకు ఎమ్మెల్యే శంకర్ సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్కు సంబంధించి అన్ని విభాగాల అధికారులు, సచివాలయాల ఇంచార్జిలు, టీడీపీ నాయకులు, వార్డ్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## శ్రీలంకలో చిక్కుకున్న మత్స్యకారులను సురక్షితంగా రప్పించేందుకు చర్యలు

### ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం, జులై 16, మేజర్‌న్యూస్: శ్రీలంకలో చిక్కుకున్న మత్స్యకారులను సురక్షితంగా స్వగ్రామానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. గ్రామీణ మండలం పెద్దగనగళ్ల పేటకు చెందిన మత్స్యకారులు దాసరి వెంకయ్య, గనగళ్ళ కొర్లయ్యలు సముద్రంలో వేటకు వెళ్లి శ్రీలంక కోస్ట్ గార్డ్ ల చేతిలో చిక్కుకున్న విషయం తెలిసిందే. వీరిని సురక్షితంగా వెనుకకు తీసుకు వచ్చేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే శంకర్ మంగళవారం తెలిపారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ మేరకు వారి కుటుంబాలకు నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం ఎమ్మెల్యే ఉచితంగా అందజేశారు. ఆయా సరుకులను మంగళవారం మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో బాధితులు వెంకయ్య, కొర్లయ్య కుటుంబసభ్యులకు అందజేశారు.

## ఇసుక చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవు

### ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం, జూలై 16, మేజర్‌న్యూస్: గార మండలం సతివాడలోని ట్రాన్సవరల్డ్ గార్నెట్ పరిశ్రమను మైనింగ్, విజిలెన్స్ అధికారులతో కలసి ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం సందర్శించారు. ఏడు సంవత్సరాలుగా మూత పడిన పరిశ్రమలో నిల్వ వున్న ముడి సరుకు ఇల్మెనైట్, రుటైల్ ఇసుక చోరికి గురవుతున్న నేపథ్యంలో ఆయా నిల్వలను పరిశీలించారు. అదేవిధంగా సముద్ర తీరం నుంచి కూడ పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నట్టు సమాచారం మేరకు ఆయా ప్రాంతాలను పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం హయాంలో సహజ వనరులు భారీగా దోచుకున్నారని ఆరోపించారు. 7ఏళ్లుగా మూతపడిన గార్నెట్ పరిశ్రమలో కూడా ఇసుక, ముడి సరుకులు కూడా దొంగతనానికి గురయ్యాయని, ఇకపై ఇటువంటి చర్యలకు అవకాశం ఉండదన్నారు. పరిశ్రమలో ఇసుక, ముడి సరుకు చోరికి గురైన విషయాన్ని కలెక్టర్ దృష్టిలో పెట్టి చర్యలకు ఆదేశిస్తామన్నారు. ఇసుకాసురులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పారు. ఈ పరిశీలనలో మైనింగ్ శాఖ డి. డి., విజిలెన్స్ ఆర్. ఐ., టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అన్నక్యాంటీన్‌కు స్థల పరిశీలన



కోటబొమ్మాళి, జూలై 16, మేజర్‌న్యూస్: అన్నక్యాంటీను ఏర్పాటు చేసేందుకు మండల కేంద్రంలో మంగళవారం పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా అయన టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, పలువురు టీడీపీ నాయకులతో కలిసి కోటబొమ్మాళి మెయిన్ రోడ్డు, పాత బస్టాండ్, రైతు బజారు ఎదురుగా, తహసీల్ధార్ కార్యాలయం ఎదురుగా, అనేక ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తర్ర రామక్రిష్ణ, వెలమల కామేశ్వరరావు, నంబాల శ్రీనివాస్, పూజారి శైలజ, కర్రి అప్పరావు, దేవాది సింహాద్రమ్మ, పైల తవిటయ్య, కోట సంతోష్ తదితరులు ఉన్నారు.

## కొలువు తీరిన మరిడమ్మ ఘటాలు



మాడుగుల, జులై 16, మేజర్‌న్యూస్: మాడుగులలో మోదకొండమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మరిడమ్మ పండుగ సందర్భంగా మంగళవారం అమ్మవారి ఘటాలు కొలువుతీరారు. ముందుగా మరిడమ్మ అమ్మవారి ఘట్టాలు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధు శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడయ్యానాయుడు ఆధ్వర్యంలో నూతన ఆలయ కమిటీ శ్రీ మరిడిమాంబ రైతు సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి కొలువు ఏర్పాటు చేశారు. ఈ నెల 18న పండుగను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, ఎంపిటిసి పొలిమేర విజయలక్ష్మి, రొబ్బా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వఒప్పందాలపై జిఓలు జారీకి కృషి చేయండి

### ఎమ్మెల్యే మామిడి కి వినతి పత్రం అందజేసిన ఆశా వర్కర్లు



కొత్తూరు, జులై 16, మేజర్‌న్యూస్: ఆశా వర్కర్లుతో ఫిబ్రవరి నెలలో ప్రభుత్వంతో కుదుర్చుకొన్న ఒప్పందాలపై జిఓ లు జారీకి కృషి చేయాలని మండలానికి చెందిన ఆశావర్కర్లు మంగళవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ను కలసి వినతి పత్రం అందజేశారు.సిఐటియు ఆధ్వర్యంలో కొత్తూరు. మండలం ఆశా వర్కర్ల యూనియన్ సభ్యులు కలసితమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరింది. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను, ఆశా వర్కర్కర్లు మార్పు చేయాలని ,జీతాలు నేరుగా చెల్లించే ఏర్పాటుకు కృషి చేయాలని వారు ఎమ్మెల్యే కు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం ఆశా వర్కర్స్ నాయకురాలు పి జయలక్ష్మి, యస్ గౌరమ్మ ,కె జోత్స్న, యస్ పావని, లక్ష్మీ ,పూర్ణ , జగదాంబ ,అనిత , రోజా, పద్మ, శ్రీలత , స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## మెట్టూరు బిట్ 1లో గ్రామదేవత ఉత్సవాలు



కొత్తూరు, జులై 16, మేజర్‌న్యూస్: కొత్తూరు మండలం మెట్టూరు బిట్ 1లో గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వాంచారు. అమ్మ వారికి మహిళలు బోనాలు సమర్పించారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకొని వర్షాలు సమృద్ధికురిసిన పంటలు బాగా పండాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమం లో వయస్సార్ జిల్లా పార్టీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అద్దె ప్రాతిపదికన ఆధునిక వ్యవసాయ యంత్రాలు

### వ్యవసాయ అధికారిణి డి రూప



రావికమతం, జులై 16, మేజర్‌న్యూస్: మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో అద్దె ప్రాతిపదిగిన వ్యవసాయ ఆధునికరణ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి డి. రూప తెలిపారు. మంగళవారం ఆమె వివిధ గ్రామాలలోని వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాలు తక్కువగా కురుస్తున్నందున వరి నారమడులలో నీరు ఎల్లప్పుడూ ఉండే విధంగా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రతి రైతు వరస కేంద్రములో ఐదుగురు సభ్యులు గల రైతుల గ్రూపుకు 15 లక్షల రూపాయలు విలువచేసే వ్యవసాయ ఆధునిక యంత్రాలను ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసింది అన్నారు. వీటిని ఆయా గ్రామాలలో అద్దె ప్రాతిపదికన రైతులకు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. వీటిని ఉపయోగించడం వల్ల సాగులో ఖర్చు తగ్గుతుందని తెలియపరిచారు. అతి తక్కువ అద్దెకు వ్యవసాయ యంత్రాలను రైతులకు ఇచ్చే విధంగా ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

## ఉగ్రవాదుల దాడిలో మండల వాసి మృతి



సంతబొమ్మాళి, జులై 16, మేజర్‌న్యూస్: జమ్మూ కాశ్మీర్ లో దోడా జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పులలో చెట్ల తాండ్ర పంచాయతీకి చెందిన డొక్కరి రాజేష్ (25) జవాన్ వీరమరణం పొందారు. మృతుడు రాజేష్ కు తల్లిదండ్రులు పార్వతి,చిట్టివాడు , డిగ్రీ పూర్తి చేసిన తమ్ముడు మధుసూదనరావు ఉన్నారు. రాజేష్ మృతితో కుటుంబం, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దేశ రక్షణ కోసం ఉగ్రవాదుల కాల్పులలో హెూరాహెూరీగా పోరాడి వసూలు బాసిన రాజేష్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. టెక్కలి నియోజకవర్గంలో నందిగాం మండలానికి చెందిన సనపల జగదీశ్వరరావు, రాజేష్ మృతి ఎంతో బాధ కలిగించిందని విచారం వ్యక్తం చేశారు. మృతులు జగదీశ్వరరావు రాజేష్ కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి తో అండగా ఉంటుందని భరోసా కల్పించారుు.

## తొలగించిన పారిశుధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

### ఏఐసీసీటియు రాష్ట్ర కమిటి సభ్యులు డి. శ్రీనివాస్



కోటబొమ్మాళి, జులై 16, మేజర్‌న్యూస్: అకారణంగా తొలగించిన కోటబొమ్మాళి ప్రభుత్వ అసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐసీసీటియు రాష్ట్ర కమిటి సభ్యులు డి. శ్రీనివాస్ అధికారులను సూచించారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ కోటబొమ్మాళి ప్రభుత్వ అసుపత్రిలో గత ఐదు సంవత్సరాలుగా పని చేస్తున్న ఏడుగురు పారిశుధ్య కార్మికులు, ముగ్గురు సెక్యూరిగార్డులను అకారణంగా ఏవిదమైన నోటీసులు ఇవ్వకుండా రాజకీయ దురుద్దేశాలతో కార్మికుల జీవితాలతో ఆటలాడుకోవడం సరికాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అయన తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తొలగించిన పారిశుధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు.

## గురు పూర్ణిమ సందర్బంగా ప్రత్యేక పూజలు

లక్కవరపుకోట, జులై 16, మేజర్‌న్యూస్: మండల కేంద్రం లోని హస్టల్ జంక్షన్ వద్ద గల శ్రీ శిరిడీ సాయి బాబా ఆలయం లో ఈ నెల గురుపౌర్ణమి (వ్యాస పూర్ణిమ),సందర్భంగా 18 వ తేదీ గురువారం నుంచి పలు పూజకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు అక్కా జోస్యుల శ్రీహరి శర్మ అన్నారు గురువారం ఉదయం పాలాభిషేకం అర్చన అలాగే సాయంత్రం శ్రీరామ కమిటీ సంగం వీధి వార్టిచే హరే రామ సంకీర్తన 19 వ తేదీ శుక్రవారం ఉదయం లక్ష్మి గణపతి హెూమం అలాగే విద్యార్థులకు హనుమాన్ చాలీసా శ్రీమద్రామాయణం పై పోటీలు సాయంత్రం శ్రీ సత్యసాయి సేవాసమితి కోమటి వీధీ వారిచే లలితా విష్ణు సహస్ర నామ పారాయణం అలాగే 20 వ తేదీ రుద్ర హెూమం శ్రీ దత్త హెూమం సాయంత్రం శ్రీ శిరిడి సాయి సేవాసమితి వారిచే భజనలు 21 వ తేదీ ఆదివారం గురుపూర్ణిమ పర్వదినం సందర్భంగా మేలు కొలువు హారతి పాలాభిషేఖం తదితర పూజ కార్యక్రమాలు అలాగే మధ్యాహ్నం అన్న సమారాధన శ్రీ శిరిడి సాయి ఉత్సవ విగ్ర హ గ్రామ ప్రదక్షిణలు నిర్వహిస్తామని ఈ కార్యక్రమం లో సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీ హరి శర్మ విజ్ఞప్తి చేసారు.

## నారా లోకేష్‌ను కలిసిన రాయపురెడ్డి కృష్ణ



మాడుగుల, జులై 16, మేజర్‌న్యూస్: మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ మంగళవారం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తాను తెలియజేసిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని కృష్ణ తెలిపారు.

## మందుబాబులకు వేల70 రూపాయల జరిమానా




**ఆనందపురం, జూలై 16, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 7 గురు పై కేసునమోదు చేశారు, ఈ మేరకు భీమిలి కోర్టులో ప్రవేశపెట్టగా, భీమిలి 15వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ డి సౌజన్య మంగళవారం ఒక్కొక్కరికి 10వేల రూపాయల్ను చొప్పున, జరి మానావిధిస్తూ తీర్పునిచ్చారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

### సర్పంచ్ చెల్లమ్మ

**దుంబ్రిగుడ, జూలై 16, మేజర్‌న్యూస్:** సీజనల్ వ్యాధుల పట్ల గిరిజన ప్రజానికం అప్రమత్తంగా ఉండాలని సర్పంచి చెల్లమ్మ అన్నారు. ఆ పంచాయతీ పరిధి గౌలి గ్రామంలో సందర్శించిన ఆమె గిరిజనులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాలతో వ్యాధులు పొంచి ఉన్నాయన్నారు. ఇళ్ల ఆవరణలో వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని "చెప్పారు. చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. కాచీ చల్లార్చిన నీటిని తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. వైద్య సిబ్బంది సూచించిన మందులను తీసుకుని ఆరోగ్యాన్ని గిరిజనులు కాపాడుకోవాలని ఆమె కోరారు.

## కేజే పురం లేఅవుట్ నిబంధనలకు వ్యతిరేకం

### ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి విచారణ



**కే కోటపాడు, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలోని కే.జె.పురం గ్రామం లో లే అవుట్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని వెల్లిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీష రాణి సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సదరు లేఅవుట్ పై నిబంధనలు మేరకు పూర్తి సమాచారముతో నివేదికను రెండు దినములలోగా ఇవ్వాలని వారిని ఆదేశించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయములో పంచాయతీ కార్యదర్శులుతో పారిశుద్ధ్య కార్యక్రమాలు, డయోరియా మరియు త్రాగు నీరు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సదరు సమావేశములో ప్రిన్సిపల్ , డి. పి. ఆర్. సి, ఈ. నాగలక్ష్మి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. ఎస్. కె. ఎన్. పట్నాయక్ , విస్తరణాదికారి (పి. ఆర్. అండ్ ఆర్డి) పి. వి. వి. ఎస్. ప్రసాద్ తదితర సిబ్బంది ఉన్నారు.

### మద్దిగ్రామంలో భక్తి శ్రద్ధలతో

## ముత్యాలమ్మ అమ్మవారి మహోత్సవం



**పద్మనాభం, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలో మద్దిగ్రామంలో కొలువు దీరి న ముత్యాలమ్మ అమ్మవారి పండగను మంగళవారం ఎంపీపీ కె.రాంబాబు, సర్పంచ బుగత సన్యాసమ్మ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు బి.ఎర్రినాయుడు, బి.మదుసూ దనరావు, కె.చినాప్పలనాయుడు సారద్యయంలో గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కనకల అప్పలరాజు ఇత్తడి ఘటంను బహుకరించారు. అయితే ముందుగా గ్రామంలో పూజారి కనకల అచ్చెన్న తమ నివాసంలో అమ్మవారికి ప్రధమ పూజను నిర్వహించారు.అనంతరం అక్కడ నుండి పూర్వ సాంప్రదాయ ప్రకారం శరాబుల వీదిలో మొదిన సూర్యనారాయణ తయారు చేసిన అమ్మవారి చెక్క ప్రతిమలకు పూజలు చేసారు. అక్కడ నుండి కోలాటాలతో గ్రామ ప్రజలు తండోపతండాలుగా అమ్మవారిని తోడ్కొని గ్రామ ప్రారంభంలో ఉన్న గుడివద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజారి అచ్చెన్న, రాంబాబు,సత్యనారాయణ, కాళ్ల సత్యనారాయణ, నగేషకుమారు పూజలు అనంతరం గ్రామ ప్రజలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గుడి వద్ద భక్తులు బారులు తీరారు.

# నవధాన్యాలు సాగుతో భూమి సారవంతం

### -రీజనల్ టెక్నికల్ అధికారి హేమ సుందర్ వెల్లడి
### -పాల్గొన్న మెంటర్ అప్పలనాయుడు తదితరులు

**గరుగుబిల్లి, జూలై 16, మేజర్‌న్యూస్:** నవధాన్యాలు సాగుతో భూమి మరింత సారవంతమవు తుందని రీజనల్ టెక్నికల్ అధికారి జి హేమసుందర్ వెల్లడించారు. ఈమేరకు సోమవారం కురుపాం మండలంలోని దురుబిలి గ్రామంలో నవధాన్యాలు సాగును పరిశీలిం చిన అనంతరం మాట్లాడారు. కురుపాం మండలంలో ఆరిక నరసమ్మతోపాటు పలువురు రైతులు దాదాపు 15 ఎకరాల్లో నవధాన్యాలు సాగు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నవధాన్యాలు సాగు చేయడం వలన భూమి సారవంతం అవు తుందని తెలిపారు. భూమిలో సేంద్రీకార్బన్ పెరగడంతోపాటు నేలలో నీటిని పట్టి ఉంచే గుణం పెరుగుతుందన్నారు. నవధాన్యాలు సాగు చేయడం వల్ల తోటకూర,



గోంగూర, తదితర కాయగూరలు పంటలు వల్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మెంటర్ మరడాన అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నీ ఉన్నా.. ఎవరూ రాక!

### అనాథకు 'రెడ్ క్రాస్' అంత్యక్రియలు

**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** అన్నీ ఉన్నా..ఎవరూ లేక ఆయన అనాథగానే మిగిలిపోయాడు. ఒంటరిగానే పైకేగిపోయాడు. అనాథకు అంత్యక్రియలు జరిపించి 'రెడ్‌క్రాస్' మన్ననలు పొందింది. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బుడ్డెపు భైరాగి రెడ్డి (70)కి నలుగురు అబ్బాయిలు, ఓ అమ్మాయి. వీరంతా పెళ్లిళ్లు చేసుకుని ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. ఇంతలో భైరాగి కొవ్వూరుకు చెందిన ఓ మహిళ పరిచయం కాగా..కట్టుకున్న భార్య బతికుండగానే కొవ్వూరు మహిళతో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. ఆమెకు కూడా ముగ్గురు పిల్లలున్నారు. అయితే వారంతా భైరాగి వద్ద డబ్బులున్నప్పుడు బాగా చూసుకునే వారు. లేనప్పుడు బయటకు గెంటేసేవారు. ఉన్న డబ్బంతా రెండో ఆమెకు తగలెట్టేస్తున్నాడన్న కోపంతో మొదటి భార్య కుటుంబం దాదాపూ ఆయన్ను పట్టించుకోవడం మానేసింది. దీంతో అటు మొదటి భార్య ప్రేమకూ నోచుకోలేక, సన్నిహితంగా మెలిగే మహిళ గౌరవానికీ నోచుకోలేక భైరాగి ఒంటరైపోయాడు. ఈ క్రమంలో రోడ్డుపై ఒంటరిగా కనిపిస్తే స్థానికులు గత నెల 27న ఆయన్ను విశాఖలోని పెదవాల్తేరులో ఉన్న రెడ్ క్రాస్ హోంలెస్ షెల్టర్‌కు



అప్పగించారు. అయితే తీవ్ర మనస్థాపం చెందిన భైరాగి మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన తాలూకా వాళ్లు ఎవరూ రాలేరని గుర్తించి జ్ఞానాపురం శ్మశాన వాటికలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖ చైర్మన్ డాక్టర్ వై.శివ నాగేందర్ రెడ్డి, సెక్రటరీ రవికుమార్ ఆదేశాల మేరకు షెల్టర్ మేనేజర్ మురళీ అంత్యక్రియలు నిర్వహించి ఆదుకు న్నారు. అనాథలకు అండ గా నిలిచే రెడ్ క్రాస్ మరో మంచి కార్యక్రమం చేప ట్టిందని ఎంవీపీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానికులు అభినందించారు.

## ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొక్కటిగా అమలు

### -సరసమైన ధరల్లో నాణ్యమైన బియ్యం కందిపప్పు
### -ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ ఎన్ రాజు



**చోడవరం, జూలై 16, మేజర్‌న్యూస్:** ఎన్నికల ముందు టిడిపి జనసేన బిజెపి కూటమి ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ ఎన్ రాజు అన్నారు. సరసమైన ధరల్లో నాణ్యమైన కందిపప్పు, బియ్యం అందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. దీనిలో భాగంగా 160 రూపాయలకు కిలో కందిపప్పు, కిలో 48, 49 రూపాయలకు సోనామసూరి సన్న బియ్యం అందేలా చోడవరం పట్టణంలో స్టాల్స్ ను ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులు, వికలాంగులు , వితంతు పింఛన్లు పెంచడంతో పాటు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, మెగా డీఎస్సీ తదితర వాటిని అమలు చేశామని, త్వరలోనే మిగిలినవి కూడా అమలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేయడంతో పాటు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, కో ఆప్షన్ మాజీ జెడ్పిటిసి జోసఫ్, చోడవరం మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పసుమర్తి వెంకట్, టిడిపి నాయకులు టి శ్రీను, బాలిబోయిన దేవుళ్ళు, ద్వారపురెడ్డి శ్రీనివాస్, బొబ్బిలి ప్రసాద్, బోను రాజు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్ర భారతి

### పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీవేడుక



**పాతపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** స్థానిక పాతపట్నం రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుక జరిగింది.ముఖ్య అతిధిగా పాల్గొన్న అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ జి.సింహాచలం విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించారు. నాయకత్వ ప్రాముఖ్యతను, నాయకత్వ లక్షణాలను మరియు విశిష్టతను ముఖ్యఅతిధి విద్యార్థులకు తెలియజేశారు.రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ యం.యెస్.మణి విద్యార్థి నాయకులకు చిత్తశుద్ధి, అంకితభావం మరియు శ్రేష్టత,నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలని తెలియజేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నార్తంధ్ర జోనల్ ఇంఛార్జ్ యెన్ .వెంకటేష్ కార్యక్రమములో పాల్గొని నూతనంగా నాయకులుగా ఎన్నికైన విద్యార్థులు ప్రతిభావంతమైన నిర్ణయాలతో తోటి విద్యార్థులలో క్రమశిక్షణను,నైతిక విలువలను, బాధ్యతను పెంపొందింపజేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ బి ప్రభాకర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి

### ఎంపీడీఓకు జనసేన వినతి



**పాచిపెంట, జూలై 16, మేజర్‌న్యూస్:** గత రెండు నెలల క్రితం నుంచి ఉపాధి బిల్లులు చెల్లి చకపోవడంతో కూలీలు రోడ్డున పడ్డారని పాచిపెంట మండల జనసేన పార్టీ నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. మంగళవారం నవీన్, లోకేష్, అజయ్, వెంకటేష్ తదితరులు ఎంపీడీవో లక్ష్మి కాంత్ కు వినతి పత్రం అందించారు. కొంతమంది ఉపాధి కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి ఇబ్బందులు చూడలేక తామంతా మీ దగ్గరికి వచ్చామని వినతి పత్రంలో పేర్కొన్నారు. బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే వంద రోజులు పని దినాలు కల్పించవలసిన ప్రభుత్వం వంద రోజులు కల్పించకుండానే పనులు నిలుపుదల చేశారని, తక్షణమే కూలీలకు ఉపాధి చూపించాలని వారంతా ఎంపీడీవోని కోరారు. సంబంధిత ఉపాధి అధికార సిబ్బంది పై తగు చర్యలు తీసుకొని ఉపాధి కూలీలకు న్యాయం చేయాలని కోరారు. వారి వినపత్రంకు సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో కూలీలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

### రామిగెడ్డకు మోక్షం రైతంగం
### హర్షం పూడికతీత పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**శ్రీకాకుళం, జూలై 16, మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం గ్రామీణ మండలం శివారు సాగుభూములకు నీరందించాల్సిన రామిగెడ్డ పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. గుర్రపుడెక్క, పూడికలు తీసే నాధుడు లేక సకాలంలో నీరందక రైతాంగం నష్టాలు చవిచూసింది. గత అయిదేళ్లలో తమగోడును ప్రజాప్రతినిధులు, అధికారులకు వెళ్ళగక్కినా పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రజాధరణతో ఎమ్మెల్యే గా గెలిచిన గొండు శంకర్ రైతుబిడ్డగా, రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా సాగునీటి యంత్రాంగంపై దృష్టి సారించి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే అయన విజ్ఞప్తి మేరకు వ్యవసాయ శాఖమంత్రి అచ్చెనాయుడు నిధులు కూడా మంజూరు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం మీదుగా ఖాజీపేట, కల్లేపల్లి మొదలు గ్రామీణ మండలంలోని శివారు భూములకు నీరందించే రామిగెడ్డ పూడికతీత మంగళవారం ప్రారంభం అయ్యాయి. విశాఖ ఏ కాలనీ వద్ద రామిగెడ్డ పూడికతీత పనులకు ఎమ్మెల్యే గొండు శంకర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పనులు శరవేగంగా పూర్తి చేసి శివారు భూములకు సకాలంలో నీరందించాలని అధికారులకు అయన ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే సబ్సిడీపై ఎరువులు, విత్తనాల పంపిణి ప్రారంభించామని, రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ది పొందాలని ఎమ్మెల్యే శంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## తిలారులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**కోటబొమ్మాళి, జూలై 16, మేజర్‌న్యూస్:** జిల్లా అందత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, తిలారు గ్రామానికి చెందిన శ్రీ శిమ్మి నాయుడు చారిటబుల్ ట్రస్ట్, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో మంగళవరం తిలారు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా తర్ర రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య శాఖ మాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో మరల ఈ హాస్పిటల్ కి పూర్వ వైభవం తీసుకువస్తామని అన్నారు. ఈ శిబిరంలో 80 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 35 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. వారిలో కంటి నరాలు చికిత్స కోసం నలుగురు , కంటి పై పొర చికిత్స కోసం ముగ్గురు, కంటి నీటి కాసుల చికిత్స కోసం ఇద్దరు, కంటి రెప్పల చికిత్స కోసం ముగ్గురు, చిన్నపిల్లల కంటి చికిత్స కోసం ఇద్దరుని ప్రత్యేకంగా ప్రముఖ డాక్టర్లచే ఆసుపత్రిలో మెరుగైన చికిత్స చేయుటకు శంకర్ ఫౌండేషన్కు తరలించారు. ఈ కార్యక్రమంలో తిలారు గవర్నమెంట్ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ మరియు శంకర్ ఫౌండేషన్ ఆప్తాల్ ఆఫీసర్ జాక్సన్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎన్‌ఏ రాజు, క్యాంపు కో ఆడినేటర్ సిహెచ్. అశ్విన్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### భాజపా ప్రజా ప్రతినిధుల
### అభినందన సభ పాల్గొన్న సిరిపురం తేజేశ్వరరావు



**పాతపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** విశాఖపట్నంలో సోమవారం జరిగిన బీజేపీ ప్రజా ప్రతినిధుల అభినందన సభలో పాల్గొన్న పాతపట్నం నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పార్టీ తరపున పోటీ చేసి ఘన విజయం సాధించిన ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన అభ్యర్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వం సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్, రాజమహేంద్రవరం ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, నడుకుదిటి ఈశ్వరరావు తదితరులను పుష్ప గుచ్చాలు ఇచ్చి దశాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) మధుకర్ జీ ని కలిసి పాతపట్నం నియోజకవర్గం లో పార్టీ బలోపేతం కై చర్చించిన సిరిపురం తేజేశ్వరరావు.

# ఎర్ర చెరువు ఆక్రమణలపై సర్వే చేయండి

### ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



**పాతపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని అంతరాబ జంక్షన్ సమీపంలోని ఎర్ర చెరువు ఆక్రమణలకు గురైందని పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకొని వెళ్ళగా మంగళవారం ఎర్ర చెరువు పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అంతరాబ జంక్షన్ సమీపంలోని మెయిన్ రోడ్ నుంచి యశోధానగర్ వరకు గల ఎర్ర చెరువు పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. మండల తహశీల్దార్ ప్రసాద్, సర్వేయర్ రామగణపతి, విఆర్‌ఓ పార్థసారది ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎర్ర చెరువుకు సంబంధించిన సర్వే నెంబర్లను, విస్తీర్ణాలను సర్వేరికార్డుల్లో పరిశీలించారు. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి ఆక్రమణలకు సంబంధించిన వివరాలు తెలియజేయాలని రెవెన్యూ సిబ్బందిని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ భూములను, చెరువులను, పర్యావరణ వనరులను కాపాడుకోవడం మన బాధ్యత అని, చెరువు ఆక్రమణల్లో ఎటువంటి పరిశీలనలు లేకుండా యధేచ్ఛగా భవనాల నిర్మాణానికి ఏవిధంగా అనుమతులు మంజూరు చేశారని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. సర్వే అనంతం నిభందనలకు విరుద్ధంగా ఆక్రమణలు చేసినట్లు నిరూపణ జరిగితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గోవిందరావు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేతో పాటు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పైల బాబ్జి, పట్టణ యువత అధ్యక్షుడు పైలాడ సతీష్, సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు, తెదేపా నాయకులు అక్కంధర సన్యాసి, సిర్ల ప్రభాకర్రావు, గోకవలస అశోక్, శంకర్, దుర్గాప్రసాద్, బుల్లి బాబు తదితరులు ఉన్నారు.

## చెత్తబుట్టలను సద్వినియోగం చేసుకోండి



**దుంబ్రిగుడ, జూలై 16, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అందించిన చెత్తబుట్టలను ఆయా గ్రామాల గిరిజనుల సద్వినియోగపరుచుకోవాలని సొవ్వ పంచాయతీ సర్పంచ్ కొండోయి సోయిత అన్నారు. మంగళవారం సొవ్వ పంచాయతీ కేంద్రం వద్ద సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఇంటింటికి చెత్తబుట్టలను ఉంచుకుని ఇంట్లో ఉండే చెత్తను చెత్తబుట్టలో వేసి పంచాయతీ వాహనం వస్తే వాటిలో ఈ చెత్తను వేయాలని ఆమె అన్నారు. అనంతరం చెత్తబుట్టలను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీని పారిశుద్ధ్యం లేకుండా పరిశుభ్రంగా ఉంచే విధంగా అందరి భాగ్యస్వామ్యంతోనే సాధ్యపడుతుందని ఆయన అన్నారు. అపరిశుద్ధ్యంగా ఉంటే దోమలు, వ్యాప్తి చెంది మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబాలమవుతుందని ఆయన అన్నారు. ప్రజలందరూ సురక్షితంగా ఉండ లంటే మన గ్రామం మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వంతల సద్దు, గ్రామ వార్డు నెంబర్లు, గ్రామ సచివాల ఉద్యోగులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పై ప్రత్యేక దృష్టి

### ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు



**వంగర, జూలై 16, మేజర్‌న్యూస్:** నియోజక వర్గంలో ఉన్నటువంటి సమస్యలు పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎం ఎల్ ఏ కిమిడి కళా వెంకట రావు అన్నారు. మంగళ వారం నాడు ఆయన క్యాంప్ కార్యాలయంలో మెరకముడిదాం మండల ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సమస్యల పట్లచర్చించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం పేదలకు అందించబోయే సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందే విధంగా కృషి చేస్తానని, ఆయనచెప్పారు.పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు, ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెరకముడిదాం మండలానికి చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ శక్తిపై అవగాహన

### నినాదాలు చేస్తున్న అంగనవాడి టీచర్లు




**కే కోటపాడు, జూలై 16, మేజర్‌న్యూస్:** మండలంలోని చౌడువాడ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రాల వద్ద మిషన్ శక్తి.. భారతీయ న్యాయం గృహిత2023-24 కార్యక్రమం పై మహిళలకు. బాలికలకు. మగవారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో చట్టాలు. శిక్షలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు తో పాటుగా బేబీ బచావో. భేటీ పడావో.. ఆడపిల్లలను కాపాడండి ఆడపిల్లలను రక్షించండని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ. రొంగలి సూర్యనారాయణ. ఎంపీటీసీ ఏటుకూరు రాజేష్. ఐసిడిఎస్. సూపర్వైజర్ జయలక్ష్మి. అంగన్వాడి కార్యకర్తలు. ఈశ్వరమ్మ. మంగ. వేణు సత్య. జగది. పరదేశమ్మ. సుబ్బలక్ష్మి. వెంకటలక్ష్మి. పాచి నవానిపాలెం అంగన్వాడీ కార్యకర్త అప్పలనర్స. తోపాటు మహిళలు. పాల్గొన్నారు.

## తీరిన 14 గ్రామాల ప్రజల చిరకాల కోరిక

### -చంద్రానగర్‌లో ఆర్టీసీ బస్సు సేవల్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు -హాజరైన కార్పొరేటర్లు, అధికారులు



**విశాఖపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాజీ జంక్షన్ కూడలి, పాత గోపాలపట్నం, చంద్రానగర్, యల్లపు వానిపాలెం, కొత్తపాలెం, భగత్‌సింగ్ నగర్, నరవ, జెర్రిపోతులపాలెం మీదుగా సబ్బవరం వరకు సుమారు 14 గ్రామాల చిరకాల కోరిక ఆర్టీసీ బస్సు ప్రయాణం. అయితే విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాత గోపాలపట్నంలో ఇటీవల నిర్మించిన అండర్ పాత్ బ్రిడ్జి నుంచి మంగళవారం నుంచి ఆర్టీసీ బస్సు ప్రయాణ సేవల్ని చంద్రానగర్‌లో ఆయన ప్రారంభించారు. దీంతో తమ చిరకాల కోరికగా మిగిలిపోయిన సమస్య ఈరోజుతో తీరిపోయిందని ఆయా గ్రామాల ప్రజలంతా ఎమ్మెల్యే సేవల్ని అభినందిస్తూ ఉప్పొంగిపోయారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఆర్టీసీ ఆర్‌ఎం, డీఎంతో 14గ్రామాల ప్రజలు, నియోజకవర్గ, వార్డు ప్రెసిడెంట్, సెక్రటరీలు, ఎన్‌డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డబ్బులు పోగొట్టు కోవద్దు

**పాతపట్నం, జూలై 16, మేజర్‌న్యూస్:** ఈ మధ్యన కొత్త తరహా సైబర్ నేరాలు జరుగుతున్నాయి రోజుకొక కొత్త పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు ఇప్పుడు మీరు మీకు తెలిసిన వాళ్ళ వైఫై వాడాలి తప్ప, ఫ్రీ గా వస్తోందని బస్టాండ్ లో, రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన పబ్లిక్ వైఫై నీ ఉపయోగించి బ్యాంక్ లావాదేవీలు ఎట్టి పరిస్థితుల్లో దయచేసి చెయ్య కండి (ఫోన్ పే, గూగుల్ పే, పేటియం) పబ్లిక్ వైఫై ఎక్కడ ఉన్నా వాడకండి ఎందుకంటే ఆప్రాంతాలలో మారు వేసి ఉన్న నేరగాళ్ల వాళ్ళ మీ అకౌంట్ లో డబ్బులు కాళీ ఐపోతాయని పాతపట్నం పోలీసు శేఖ వారు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.